ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.30 (305.6838)	15,060	15,060
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.15 (4.24)	1,642.81	2,493.07
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.226 (43.0610)	10,544	8,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250



బెస్ట్ అవైలబుల్ స్కీం నిధులు విడుదల చేయాలని కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు (ఫైల్)

ఆర్థికంగా వెనకబడిన ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన పిల్లలకు నాణ్యమైన ప్రైవేట్ విద్య అందించే లక్ష్యంతో ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కీం (బీఏఎస్)ను ప్రవేశపెట్టింది. ఏటా 1 నుంచి 5వ తరగతుల్లో అడ్మిషన్లు కల్పిస్తూ 10వ తరగతి వరకు విద్యార్థులకు ఉచితంగా ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వం విద్య అందిస్తోంది. అందుకు ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వం ఫీజులు చెల్లిస్తుంది. అయితే మూడేళ్లుగా దీనికి సంబంధించిన నిధులు పెండింగ్‌లో ఉంచడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- (ఆంధ్రజ్యోతి, నల్లగొండ టౌన్)

ఇలా అయితే చదువు సాగేదెలా?

- జిల్లాలో నీరుగారుతున్న బీఏఎస్ పథకం
- ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నామమాత్రంగానే ప్రైవేట్ విద్య
- తల్లిదండ్రుల నుంచే పుస్తకాలకు, హాస్టల్‌కు డబ్బు వసూలు
- మూడేళ్లుగా నిధులు ఇవ్వని ప్రభుత్వం



బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ప్రభుత్వం నిరుపేద విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో రెసిడెన్షియల్, డేస్కాలర్స్ విధానంలో చదువుకునే అవకాశం కల్పిస్తోంది. అందుకు ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖల ద్వారా పాఠశాలలను ఎంపిక చేసి ఏటా నోటిఫికేషన్ విడుదల చేసి 1, 3, 5 తరగతుల్లో ప్రవేశాలకు లాటరీ విధానంలో విద్యార్థులను ఎంపిక చేస్తోంది. ఎంపికైన విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో చదివేందుకు ప్రభుత్వమే పాఠశాల ఫీజులు, హాస్టల్ ఫీజులు విడుదల చేస్తుంది. అయితే గడిచిన మూడేళ్లుగా జిల్లాలో బీఏఎస్ పాఠశాలలకు నిధులు విడుదల కాకవడంలేదు. జిల్లావ్యాప్తంగా రూ.8.5కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో ఇటీవల ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిరసన నిర్వహించాయి. దీంతో దసరా పండుగ అనంతరం బకాయిల్లో 25శాతం నిధులను మాత్రమే ప్రభుత్వం విడుదల చేసింది.

8 21 పాఠశాలల ఎంపిక

జిల్లాలో బెస్ట్ అవైలబుల్ పథకానికి సాంఘికసంక్షేమశాఖ పరిధిలో 13 పాఠశాలలను, గిరిజన సంక్షేమశాఖ పరిధిలో 8 పాఠశాలలను ఎంపిక చేశారు. మొత్తం 21 పాఠశాలల్లో 3,000 మంది ఈ స్కీం కిం ద విద్యనభ్యసిస్తున్నారు. ఆయా పాఠశాలల్లో 5 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.42వేలు, నాన్ రెసిడెన్షియల్ విద్యార్థులకు రూ.28వేల చొప్పున ప్రభుత్వం ఏటా ఖర్చు చేస్తోంది. 1 నుంచి 5వ తరగతుల వరకు చదివే డేస్కాలర్‌కు పుస్తకాలు, షూ, నోటుబుక్స్ ఇస్తోంది. 5 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న వారికి హాస్టల్ వసతి కల్పిస్తోంది. అయితే వీటికి సంబంధించిన నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల ప్రభుత్వం 25శాతం బకాయి నిధులు విడుదల చేయగా, ఇంకా రూ.6కోట్ల మేర బిల్లులు చెల్లించాల్సి ఉంది.

అవగాహన లేకపోవడంతో

బీఏఎస్ ద్వారా ఎంపికైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పథకంపై పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడంతో యాజమాన్యాలు ఎలా చెబితే అలా ఫీజు చెల్లిస్తున్నారు. నోటుబుక్స్, పాఠ్యపుస్తకాలు, హాస్టల్, షూ, అడ్మిషన్ ఫీజు ఇలా ప్రైవేట్ పాఠశాలలు అన్నీ ఉచితంగా అందించాల్సి ఉంది. కానీ, ప్రభుత్వం నిధులు విడుదల చేయడంలేదనే సాకు చూపి ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే చాలా పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫీజులు వసూలు చేసినట్టు సమాచారం. కొన్ని పాఠశాలల్లో కేవలం తరగతులు నిర్వహించేందుకు మాత్రమే అనుమతులు ఉండగా, అందుకు విరుద్ధంగా హాస్టల్స్ కొనసాగిస్తూ, విద్యార్థులకు వసతి కల్పించి తల్లిదండ్రుల నుంచి హాస్టల్ ఫీజులు వసూలు చేస్తున్నట్టు తెలిసింది. చాలా పాఠశాలల్లో విద్యార్థులకు మూడు పూటలా పెట్టాల్సిన..

- మిగతా 8వ పేజీలో...

సీసీఐలో పత్తి విక్రయించేందుకు

కౌలు రైతులకు ఓకే

» 'కపాస్ కిసాన్ యాప్'లో అందుబాటులో ఆప్షన్ » పట్టాదారు ఓటీపీ చెబితేనే విక్రయించేలా తిరకాసు



ప్రభుత్వరంగం సంస్థ అయిన సీసీఐలో పత్తి విక్రయించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కౌలు రైతులకు అనుమతి ఇచ్చాయి. గతంలో కౌలు రైతును గుర్తించడం, లేదా నేరుగా వారి బ్యాంక్ ఖాతాలో డబ్బు జమ చేయడం చేసేవారు. అయితే కొన్నేళ్లుగా ధాన్యంతో పాటు పత్తి, ఇతర పంటలను ప్రభుత్వరంగ సంస్థల్లో విక్రయిస్తే కౌలు రైతులకు బదులు ఆ సొమ్మును పట్టాదారుకు చెందిన బ్యాంక్ ఖాతాలో జమచేస్తున్నారు. ప్రస్తుతం కూడా అదే పరిస్థితి ఉన్నా, పట్టాదారు సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీ చెబితే కౌలు రైతుల ఖాతాలో నగదు జమ చేసేలా ఈసారి ఆప్షన్ కల్పించారు. ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన 'కపాస్ కిసాన్ యాప్'లో ఈ ఆప్షన్‌ను పొందుపర్చారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

జిల్లాలో గత నెల 24వ తేదీ నుంచి సీసీఐ పత్తి కొనుగోలు చేస్తున్నా, కౌలు రైతులకు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి ఆప్షన్ లేదు. దీంతో కౌలు రైతుల ఆందోళనను దృష్టిలో ఉంచుకొని జిల్లా వ్యవసాయశాఖ అధికారులు వెబ్‌సైట్‌ను ఆప్షన్‌ను కల్పించారు. 'కపాస్ కిసాన్ యాప్'లో కౌలు రైతులు కౌలు చేస్తున్న భూముల సర్వే నెంబర్‌ను, భూమి వివరాలను నమోదు చేశాక సంబంధిత శాఖ అధికారులు పట్టాదారుకు ఫోన్ చేసి ఓటీపీ అడుగుతారు. సదరు పట్టాదారు ఓటీపీ చెబితేనే కౌలురైతు పత్తిని విక్రయించే అవకాశం ఉంది. అయితే చాలా మంది పట్టాదారులు కౌలుదారుకు కౌలు ఇస్తున్నట్లు ఎక్కడా అగ్రిమెంట్ చేసుకున్న దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో ఓటీపీ చెబితే రానున్న రోజుల్లో ఏమైనా ఇబ్బందులు తలెత్తుతాయా అని పట్టాదారులు కొంత అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని అధికార యంత్రాంగం ఈ ఒక్క సీజన్‌లో కొనుగోళ్లకు మాత్రమే సంబంధిత 'కపాస్ కిసాన్ యాప్' ద్వారా....

- మిగతా 8వ పేజీలో...

సహజ వ్యవసాయాన్ని

ప్రోత్సహించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



మునుగోడు మండలం కిష్టాపురం గ్రామంలో సేంద్రియ ఎరువుల ద్వారా సాగు చేస్తున్న వరి పైరును పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి


మునుగోడురూరల్, నవంబరు 13,(ఆంధ్రజ్యోతి):సహజ సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మండలంలోని కిష్టాపురం గ్రామంలో రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుండా యువ రైతు జక్కుల వెంకటేశ్ పండిస్తున్న సహజ పంటలను గురువారం ఆమె పరిశీలించారు. సహజ పంటలను ఏ విధంగా పండిస్తున్నారని రైతును అడిగి తెలుసుకున్నారు. ఈ పంటలతో లాభాలు, పంటలు ఏ విధంగా ఉన్నాయి, ఈ పంటలు కావల్సిన సహజ ఎరువులు వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జీవామృతం, జీవగణామృతం వాడతామని వెంకటేష్ తెలిపారు. సహజ వ్యవసాయంద్వారా రైతులఉత్పత్తి వ్యయాలుతగ్గి, నాణ్యమైన పంటలు, పర్యావరణానికి హాని లేకుండా ఆరోగ్యకరమైన ఆహారం లభిస్తుందన్నారు. జిల్లాలో సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, రైతులు ఈ పద్ధతిని అవలంబిస్తే భూసారాన్ని కాపాడుతూ ఆరోగ్యకరమైన పంటలను ఉత్పత్తి చేయగలుగుతారన్నారు. సహజ పద్ధతిలో సాగు చేయాలనుకున్న రైతులకు సాంకేతిక సాయం అందించాలని అధికారులకు సూచించారు. ఈ నెల 22న నల్లగొండ కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఉదయాదిత్య భవన్‌లో సహజ వ్యవసాయంపై విజయరామ సహజ వ్యవసాయ నిపుణుల అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, డీఆర్‌డీపీడీ శేఖర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్, ఆర్డీవో శ్రీదేవి, అనంతరెడ్డి ఏడీ వేణుగోపాల్, తహసీల్దార్ నరేష్ పాల్గొన్నారు.

పోడు భూముల సమస్య యథాతథం

» ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని వైనం » చందంపేట అటవీ ప్రాంతంలో నిత్యం ఘర్షణ వాతావరణం » తాజాగా, అటవీ అధికారులపై దాడిచేసిన ఐదుగురిపై కేసు

నల్లమల అటవీ ప్రాంతమైన చందంపేట, పీఏపల్లి మండలాల్లో రైతులు, అటవీశాఖ అధికారుల మధ్య నిత్యం ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంటోంది. ప్రభుత్వాలు కొన్నేళ్ల క్రితమే అటవీ హక్కుల పత్రాలు అందజేసిందని, సేద్యంలో ఉన్నా అటవీశాఖ అధికారులు తరచూ దాడులు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, కొంత కాలంగా యంత్రాలతో అటవిని ధ్వంసం చేసి కొంతమంది భూములను ఆక్రమించుకుంటున్నారని, తనిఖీలు, విచారణకు వెళ్తే దాడులకు పాల్పడుతున్నారని అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఇలా నిత్యం ఉద్రిక్తత వాతావరణం ఉంటోంది.

- (ఆంధ్రజ్యోతి,దేవరకొండ)



చందంపేట మండలం నల్లమల అటవీ ప్రాంతం

నల్లమల పరిధిలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ కింద చందంపేట, పీఏపల్లి మండలాల్లో 26,795 హెక్టార్లలో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. సాగర్ రేంజ్ పరిధిలో కంబాలపల్లి, దేవరకొండ రేంజ్‌లు ఉన్నాయి. అటవీ జంతువుల సంరక్షణ, అడవి అభివృద్ధికి గత ఏడాది కేంద్ర ప్రభుత్వం రూ.450కోట్లు కేటాయించింది. దీంతో బేస్ క్యాంపులు, నీటితొట్లు, చెక్‌డ్యాంలు, కంచె, సీసీ కెమెరాలతోపాటు పలు అభివృద్ధి పనులు చేపట్టారు.

14,942 ఎకరాల భూమి 7,176 మందికి కేటాయింపు

నాగార్జునసాగర్ ముంపు బాధితులకు నల్లమల ప్రాంతమైన చందంపేట, పీఏపల్లి మండలాల్లో అటవీ భూములకు ప్రభుత్వాలు 7,176 మందికి 14,942 ఎకరాలకు పట్టాలు ఇచ్చిందని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. కాగా, మరికొంత మంది రైతులు కొన్నేళ్లుగా అటవీ భూములను సేద్యం చేస్తూ హక్కు పత్రాల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే సేద్యం చేసుకుంటున్న భూమిని అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకుంటున్నారని వారు వాపోతున్నారు. తాజాగా ఈనెల 12న చందంపేట మండలం గువ్వలగుట్ట అటవీ ప్రాంతంలో నాగార్జునసాగర్ ఎఫ్ఆర్‌వో సంగీత ఆధ్వర్యంలో అధికారుల బృందం తనిఖీలు నిర్వహించింది. గువ్వలగుట్ట సమీపంలో మూడావత్ లాలునాయక్ అనే రైతు యంత్రాలతో భూమిని చదును చేస్తున్నాడని తెలుసుకున్న అటవీశాఖ అధికారులు అక్కడికి చేరుకొని విచారణ నిర్వహించారు. దీంతో సదరు రైతు తనకు హక్కు పత్రాలు ఉన్నాయని, ఇంటి వద్ద ఉన్నాయని చెప్పాడు. అటవీ అధికారులు సమీపంలోనే ఉన్న గువ్వలగుట్ట గ్రామానికి వాహనంలో రైతు లాలును తీసుకెళ్లగా, గ్రామ శివారు వద్దకు చేరగానే గ్రామానికి చెందిన కొంతమంది యువకులు ముకుమ్మడిగా అటవీశాఖ అధికారులపై దాడులు చేశారు. ఈ దాడుల్లో సెల్‌ఫోన్‌లు ధ్వంసమయ్యాయి. అటవీశాఖ వాహన డ్రైవర్ మహమ్మద్ ఖాజా, సిబ్బంది, బీట్ అధికారులు మోహిత్‌కృష్ణ, విష్ణు, సుమన్, కిరణ్‌కుమార్, శ్రీనివాస్‌కుమార్, చంద్రయ్యకు గాయాలయ్యాయి. దీంతో అటవీ అధికారులు దేవరకొండకు చేరుకొని గాయపడిన వారిని ఆస్పత్రిలో చేర్పించారు. ఖాజా, శ్రీనివాస్‌కుమార్‌కు తీవ్ర గాయాలవడంతో మెరుగైన వైద్యం కోసం నల్లగొండకు తరలించినట్లు కంభాలపల్లి రేంజ్ అటవీశాఖ అధికారి భాస్కర్ తెలిపారు. దాడికి పాల్పడిన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు ఐదుగురిపై కేసు నమోదు చేశారు. కాగా, ఇలాంటి ఘటనలతో తరచూ నల్లమలలో ఉద్రిక్త వాతావరణం నెలకొంటోంది. సేద్యంలో ఉన్న రైతులకు పట్టాలు ఇచ్చి హక్కులు కల్పించాలని రైతు సంఘాల నేతలు కోరుతున్నారు.

కాలానికి అనుగుణంగా అనుమతులు ఇవ్వాలి



ప్రభుత్వం ఇచ్చిన అటవీ భూముల సేద్యానికి యంత్రాలతో పనులు చేసేందుకు అనుమతిలేదు. పాత పద్ధతిలోనే ఎద్దులు, నాగళ్లతో దున్నుకోవాలి. రెండు మూడేళ్ల సేద్యం చేయకుంటే ఆ భూములను అటవీశాఖ అధికారులు ఆక్రమించుకుంటున్నారు. సేద్యంలో ఉన్న రైతులందరికీ హక్కు పత్రాలు ఇవ్వడంతోపాటు యంత్రాలతో వ్యవసాయం చేసుకునేలా అనుమతులు ఇవ్వాలి.

- కంభాలపల్లి ఆనంద్, రైతు సంఘం నేత, దేవరకొండ

హక్కుపత్రాలు ఇవ్వకపోవడం వల్లే సమస్యలు

గత 40 ఏళ్లుగా భూములు సాగు చేసుకుంటున్నాం. నాగార్జునసాగర్ ముంపు బాధితులకు అప్పట్లో ప్రభుత్వం డీ-ఫారెస్ట్ పట్టాలు ఇచ్చింది. కొందరికి హక్కుపత్రాలు ఇవ్వకపోవడంతో సేద్యంలో ఉన్నా అటవీ అధికారులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. దీంతో గొడవలు జరుగుతున్నాయి. ప్రభుత్వాలు పట్టాలు ఇచ్చి హద్దులు నిర్ణయిస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

- బాలాజీనాయక్, రైతు, గువ్వలగుట్టతండా

దాడులు చేస్తే చర్యలు

అటవీశాఖ ఉద్యోగులు అటవీ సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నారు. గువ్వలగుట్టలో గ్రామస్థులు అటవీశాఖ అధికారులపై దాడులు చేయడం సరైన పద్ధతికాదు. ప్రభుత్వం ఇచ్చిన హక్కుపత్రాలు చూపిస్తే సరిపోతుంది. అటవీ సంరక్షణకే ఉద్యోగులు పనిచేస్తున్నారు. మున్ముందు ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటాం.

- రాజశేఖర్, జిల్లా అటవీశాఖ అధికారి

త్వరగా ధాన్యం కొనుగోలు చేయాలి

డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి



మర్రిగూడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీచేస్తున్న పీడీ శేఖర్‌రెడ్డి

మర్రిగూడ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రైతులు కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని త్వరగా కొనుగోలు ప్రారంభించాలని డీఆర్‌డీఏపీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు విక్రయాలకు తీసుకొచ్చిన ధాన్యం ఆరబెట్టి తాలు లేకుండా తూర్పాల పట్టి తేమశాతం (మ్యాచర్) వచ్చే విధంగా ఉంటే ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర పొందాలని సూచించారు. హమాలీలకు రైతులే రూ.45వేల చొప్పున కూలి చెల్లించాలన్నారు. అదేవిధంగా రైతులు సీసీఐ కేంద్రానికి తీసుకొచ్చిన ధాన్యాన్ని రైతుల పేర్లను రికార్డులో తప్పనిసరిగా నమోదు చేయాలని, రైతులకు ఏ విధమైనటు వంటి ఇబ్బందులకు గురి చేయవద్దని అధికారులకు సూచించారు. రైతులు తెచ్చినటు వంటి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని ఏ ఒక్కరూ అధైర్యపడవద్దని రైతులు నిబంధనలు పాటించాలని సూచించారు. ఈయన వెంట మర్రిగూడ ఐకేపీ సిబ్బంది అధికారులు ఉన్నారు.

వేగం కన్నా ప్రాణం మిన్న

- ప్రమాదాల నివారణకు పోలీసుల వినూత్న ఆలోచన
- వాహనదారులకు అవగాహన కల్పిస్తూ హోర్డింగ్
- ప్రమాదానికి గురైన కారు వెలిమినేడు శివారులో ఏర్పాటు

7

బీసీ రిజర్వేషన్ల తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ చక్రహరి రామరాజు



జిల్లా కేంద్రంలో బీసీ ధర్మపోరాట దీక్షలో మాట్లాడుతున్న చక్రహరి రామరాజు

నల్లగొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ చక్రహరి రామరాజు డిమాండ్ చేశారు. గురువారం జిల్లాకేంద్రంలోని ఎన్జీ కళాశాల ఎదుట బీసీ ధర్మపోరాట దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చొరవ తీసుకుని రాజ్యాంగ బద్ధమైన రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నారు. రాష్ట్రంలోని బీజేపీ ఎంపీలు బాధ్యత తీసుకొని 42శాతం రిజర్వేషన్లు అమలు జరిగే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి చట్టబద్ధత కల్పించాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీక రంగాల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలనే నేపథ్యంలోనే రాష్ట్ర బీసీ జేఏసీ పిలుపు మేరకు దీక్ష చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు తండు సైదులు గౌడ్, సుంకరి మల్లేష్‌గౌడ్, పిల్లి రామరాజుయాదవ్, నేలపట్ల సత్యనారాయణ, కాసోజు విశ్వనాథం, నకిరేకంటి కాశీనాథం, చిక్కుల రాములు, ఇంద్రయ్య, సీతారాములు, వెంకటేశ్వర్లు, సోమ మల్లయ్య, బొమ్మరబోయిన కేశవులు, సాయిబాబా, రమేష్, శ్యాంసుందర్, బిక్షం, ఆదినారాయణ, ఎల్లం రాజు, మధు, రాములు, మల్లయ్య, కంది సూర్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు కృషి



మొబైల్ ఎక్స్‌రే స్క్రీనింగ్ తీరును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

డీఎంహెచ్‌వో శ్రీనివాస్

మునుగోడు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేక శ్రద్ధతో కృషి చేస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్ తెలిపారు. గురువారం మునుగోడు పీహెచ్‌సీలో నిర్వహించిన ఏఐ పవర్డ్ మొబైల్ ఎక్స్‌రే స్క్రీనింగ్ క్యాంపును డీటీసీవో డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తితో కలిసి ఆయన సందర్శించారు. పరీక్ష తీరును పరిశీలించారు. వైద్య పరీక్షలకు వచ్చిన రోగులతో మాట్లాడిన అనంతరం ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రజలు తమ ఆరోగ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ఇబ్బందులు నెలకొనే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఆరోగ్యం కోసం వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ నర్మద, జిల్లా వైద్య ఆరోగ్య ఆర్గనైజర్ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వెరైటీ

పొద్దున్నే ఒక కప్పు చాయ్ కడుపులో పడితే ఆ అనుభూతే వేరు. చాయ్ అందరి జీవితాల్లో ఓ భాగమైపోయింది. కొంతమంది రోజులో ఐదు నుంచి 10 కప్పుల టీ తాగుతుంటారు. తేనీటి ప్రియుల అభిరుచి మేరకు టీ స్టాళ్లు వెలుస్తున్నాయి. బెల్లం, అల్లం, యాలకులతో పాటు ఆయుర్వేదిక్ మూలికలతో తయారుచేసిన చాయ్‌లు విక్రయిస్తూ ఆకట్టుకుంటున్నారు.

(ఆంధ్రజ్యోతి-చండూరు)

ప్రస్తుతం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో టీస్టాల్స్ విరివిగా విస్తరిస్తున్నాయి. అదే స్థాయిలో ఆదరణ పెరుగుతోంది. అన్ని ప్రాంతాల్లో ప్రధాన కూడళ్లలో కొత్త టీ స్టాల్స్ వెలుస్తున్నాయి. కొందరు ప్రముఖ కంపెనీల నుంచి ఫ్రాంఛైజీ తీసుకుని స్టాల్స్ ఏర్పాటుచేస్తున్నారు. ఒక్కో టీ స్టాల్‌కు ఒక్కో ప్రత్యేకత ఉంటోంది. పేర్లలోనూ భిన్నత్వం, ఆకట్టుకునేలా చూస్తున్నారు. ఆంటీ, నైన్ టీ హౌస్, టీ టైం, బెల్లం టీ, తాటి బెల్లం టీ, ఆయుర్వేదిక్ టీఇలా కొత్తకొత్త పేర్లతో స్టాల్స్ వెలుస్తున్నాయి. ప్రత్యేక రుచులతో ఉన్న టీలను తాగేందుకు ప్రజలు ఇష్టపడుతున్నారు.



ప్రయోజనాలు ఇవీ

వివిధ రకాలైన ఆయుర్వేదిక్ టీ తాగడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని నిర్వాహకులు చెబుతున్నారు. గ్యాస్ట్రిక్, జలుబు, దగ్గు, సైనస్, శ్వాసకోస సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. కొన్నింటితో కాలేయ పని తీరు మెరుగుపడుతుంది. బరువు నియంత్రణ, మెదడు పని తీరు మెరుగు, రోగ నిరోధకశక్తి పెరగడం వంటి ప్రయోజనాలు ఉంటాయంటున్నారు. ఆయుర్వేదిక్ చాయ్‌లతో మహిళల్లో హార్మోన్ల సమతుల్యత ఏర్పడుతుందని చెబుతున్నారు. చక్కరకు బదులుగా ఈ మధ్య తాటిబెల్లాన్ని వాడుతున్నారు.

ఆయుర్వేదిక్ టీ మా ప్రత్యేకత



ఏడాది కిందట చండూరులో టీ స్టాల్ ఏర్పాటు చేశా. మూలికలతో తయారు చేసిన టీని తయారు చేస్తాం. తాటి బెల్లంతో పాటు వివిధ రకాలైన వన మూలికలతో టీ తయారు చేస్తాం. అతి మధురం టీ మా ప్రత్యేకత.

గంట రమేష్, తాటి బెల్లం, ఆయుర్వేదిక్ టీ స్టాల్ నిర్వాహకుడు

బెల్లం ఆరోగ్యానికి మంచిది



బెల్లంతో తయారు చేసిన చాయ్‌ని ప్రతి రోజూ తాగుతాను. బెల్లంతో పాటు అల్లం, లెమన్‌తో టీ తయారుచేస్తారు. బెల్లంతో తయారుచేయడం వల్ల షుగర్ లాంటి వ్యాధులు రాకుండా ఉంటాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

దోటి వెంకటేశ్‌యాదవ్,చండూరు

చాయ్‌ని అతిగా తాగవద్దు

రోజూ టీ తీసుకుంటే మెదడు చురుగ్గా పనిచేస్తుంది. టీలో యాంటీఆక్సిడెంట్ విటమిన్లు ఎక్కువగా ఉంటాయి. అలసట రాకుండా చేస్తుంది. గుండెపోటు, బ్రెయిన్‌స్ట్రోక్ రాకుండా చేస్తుంది. టీ అధికంగా తీసుకోవడం వల్ల అల్సర్, గ్యాస్, ఎసిడిటీ, నిద్రలేమి, రక్తహీనత, ఆకలి లేకపోవడం లాంటి ఆరోగ్య సమస్యలు వస్తాయి. కల్తీ పదార్థాలతో చేసిన చాయ్ సేవించడం వల్ల క్యాన్సర్ లాంటి ప్రమాదకర వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయని పరిశోధనలో తేలింది.

డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, డీటీసీవో, ప్రభుత్వ వైద్యులు నల్లగొండ

కుటుంబాల్లో క్యాసినో కార్చిచ్చు

అత్యాశ, రాత్రికి రాత్రే కోటీశ్వరులు కావాలన్న దురుద్దేశం వైట్‌కాలర్ ఏజెంట్లకు వరంగా మారుతోంది. రూ.లక్ష పెట్టుబడితో రాత్రికి రాత్రే లక్షాధికారులు కావచ్చని నమ్మబలుకుతారు. రూ.లక్ష చెల్లిస్తే గోవాకు తీసుకెళ్లి, తీసుకువస్తారు. అక్కడే వారి మాయా మచ్ఛీంద్రాన్ని ఉపయోగిస్తారు. రంగుల క్యాసినోలకు తీసుకెళ్తారు, జల్సాలు, పేకాట పేరుతో చేతిలో డబ్బులు లేకున్నా అప్పులు చేయించి లూటీ చేస్తారు. ఆ తర్వాత బాధిత కుటుంబంలో అనుకోని ఆర్థిక కార్చిచ్చుకు కారణమవుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి-ఆలేరు రూరల్)

- గోవా యాత్ర పేరుతో క్యాసినో, జూదంకు అలవాటు
- ఇళ్లు, ప్లాట్లు కుదువపెట్టి మరీ వెళ్తున్న యువత
- అన్నీతామై వ్యవహరిస్తున్న ఏజెంట్లు



పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు లక్ష్మీపతి (ఫైల్ ఫొటో)

యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు కేంద్రంగా వైట్ కాలర్ నేరాలు పెరుగుతున్నాయి. ఆర్థికంగా ఉన్న వారిని, కష్టపడి సంపాదిస్తూ కుటుంబ సభ్యులతో ఆనందంగా జీవిస్తున్న వారిని ఏజెంట్లు లక్ష్యంగా చేసుకుంటున్నారు. విహారయాత్రల పేరుతో ఉచ్చులోకి దించుతున్నారు. ఒప్పించి, మెప్పించి విమానంలో గోవాకు తీసుకెళ్లి తీసుకువస్తారు. ప్రధానంగా ఏజెంట్ల ఉచ్చులో పడి గోవాకు వెళ్లిన వారు క్యాసినో మాయలో పడి ఆర్థికంగా చితికిపోతున్నారు. రాష్ట్రంలో జూదం, పేకాట నిషేధం ఉండటం, గోవాలో వీటికి ప్రభుత్వ అనుమతి ఉండటంతో అక్కడికి వెళ్లాక క్యాసినోకు తీసుకెళ్తున్నారు. రూ.లక్షకు లక్షాధికారి కావచ్చంటూ జేబులు లూటీ చేస్తున్నారు. వారి దగ్గర డబ్బులు లేకున్నా ఇళ్లు, భూములు, ప్లాట్లకు సంబంధించిన పత్రాలు, బంగారు ఆభరణాలను కుదువ పెట్టుకొని అప్పుగా ఇచ్చి ప్రోత్సహిస్తారు. ఒక వ్యక్తిని గోవాకు తీసుకెళ్లడం ద్వారా ఏజెంట్లకు సుమారు రూ.10 వేలు దక్కుతుంది. గోవాకు వెళ్లగానే రూ.లక్ష విలువ చేసే ఒక టోకెన్ ఇవ్వడంతో క్యాసినో ఆడటానికి అనుమతి లభిస్తుంది. కొంతమంది 3రోజుల పాటు అక్కడ ఉంటుండగా ఉదయం విమానం ద్వారా వెళ్లి రాత్రి విమానం ద్వారా వచ్చే వారు కూడా ఉన్నారు.

అధిక వడ్డీలతో ఊబిలోకి జారి

గోవాకు వెళ్లిన వారిని మాయమాటలతో క్యాసినో ఉచ్చులో దించుతున్నారు. ఇందులో వ్యాపారులు, రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ రంగాల వారు, తాజా మాజీ ప్రజాప్రతినిధులతో పాటుగా మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారు కూడా ఉన్నారు. లక్షలాది రూపాయలు క్యాసినో ఆటలో పోగొట్టుకొని ఆర్థికంగా చితికిపోతూ పచ్చని కుటుంబంలో చిచ్చు పెట్టుకుంటున్నారు. తమవెంట తీసుకెళ్లిన డబ్బులు ఈ ఆటలో పోగొట్టుకుంటే అప్పుగా డబ్బులు ఇచ్చేవారు కూడా అక్కడే ఉంటారు. స్థిర, చరాస్తులను తాకట్టు పెట్టుకుని 10 రోజులకు అప్పుగా రూ.లక్షకు రూ.30 నుంచి రూ.35 వేల రూపాయలను వడ్డీ కింద తీసుకొని మిగతా డబ్బు రూ.65 వేల నుంచి రూ.70 వేల వరకు తక్షణమే ఇస్తుంటారు. దీంతో సామాన్య, మధ్య తరగతి వారు ఇళ్ల స్థలాలలో పాటు తమ భార్యల మెడపై ఉన్న పుస్తెలతాడును సైతం కుదవ పెడుతూ అప్పుల ఊబిలో పడిపోతున్నారు.

ఆలేరు కేంద్రంగా గోవాకు...

క్యాసినోలో జూదం ఆడేందుకు ఒకప్పుడు జనగామ, భువనగిరి జిల్లా కేంద్రంతో పాటు యాదగిరిగుట్ట కేంద్రంగా ఉండేది. ప్రస్తుతం ఆలేరు కేంద్రంగా కొనసాగుతోంది. ఏజెంట్లు 20మందిని గ్రూపుగా చేసి గోవాకు తీసుకెళ్తున్నారు. క్యాసినో ఆడాలంటే ముందుగా రూ.లక్ష ఇస్తే అక్కడ మూడు రోజుల పాటు ఉండేందుకు అన్నిరకాల ఏర్పాట్లతో పాటు విమానంలో తీసుకెళ్లి తీసుకొస్తుంటారు. ఈవిధంగా వారానికి రెండు, మూడు బ్యాచులు నెలకు 8 నుంచి 10 బ్యాచులు వెళ్తున్నట్లు సమాచారం. కొందరు వారానికి నాలుగుసార్లు వెళ్లి క్యాసినో ఆడి వస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా భర్తతో పాటు క్యాసినోకు వెళ్తున్న భార్యలు కూడా ఉన్నట్లు సమాచారం. ఈ మాయాజాలంలో మరికొన్ని కుటుంబాలు పడకముందే పోలీసులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. సులువుగా డబ్బు సంపాదన మోజులో ఉన్నదంతా పోగొట్టుకొని కుటుంబంతో ఉండలేక సమాజంలో తలెత్తుకోలేక అనారోగ్యాల బారిన పడుతూ నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు.

కుటుంబాలు విచ్ఛిన్నం



క్యాసినో వలలో పడి ఎంతోమంది పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయి. భార్యాభర్తల మధ్య గొడవలు, వివాదాలు జరుగుతున్నాయి. పుస్తెలతాడులు కూడా తాకట్టు పెట్టి క్యాసినోలో ఆడుతున్నారు. దీని వెనక రాజకీయ నేతల మద్దతుతో పాటు వైట్ కాలర్ల హస్తం ఉంది.

- పులిపలుపుల మహేష్, అధ్యక్షుడు, రాఘవా స్వచ్ఛంద సేవా సంస్థ, ఆలేరు

గంజాయి, క్యాసినోపై అవగాహన కల్పించాలి



యువత చెడుమార్గంలో పడకుండా పోలీసులు అవగాహన కల్పించాలి. దేశ భవిష్యత్‌కు బాటలు వేయాల్సిన యువత గంజాయి మత్తులో పడి తమ జీవితాలను కోల్పోతున్నారు. క్యాసినోకు అలవాటు పడి తాము నివాసం ఉంటున్న ఇళ్లను కూడా విక్రయించడానికి వెనుకాడటం లేదు. మరిన్ని కుటుంబాలు వీధిన పడకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

- రాంగోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్, బొందుగుల

అధికవడ్డీలకు అప్పులిచ్చినా కఠిన చర్యలు



యువత అనవసర జల్సాలకు అలవాటుపడి అప్పులపాలు కావద్దు. కుటుంబాలను నాశనం చేసుకోవద్దు. క్యాసినో కోసం గోవాకు తీసుకెళ్తున్నారనే సమాచారం ఉంది. తీసుకెళ్లే ఏజెంట్లపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. ప్రోత్సహించినా, అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చినా కేసులు నమోదు చేస్తాం.

- యాలాద్రి, సీఐ, ఆలేరు

నలుగురు గంజాయి విక్రేతల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు, పక్కన సీఐ, ఎస్ఐ, సిబ్బంది

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులను నల్లగొండ జిల్లా త్రిపురారం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి వివరాలను డీఎస్పీ రాజశేఖరరాజు తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. స్నేహితులైన అడవిదేవులపల్లి మండలం ముదిమాణిక్యం గ్రామానికి చెందిన పిల్లి మణికంఠ, మాడ్గులపల్లి మండలం పెద్దదేవులపల్లి గ్రామానికి చెందిన దండు వినోద్, బండి కోటేష్‌లకు గంజాయి తాగే అలవాటు ఉంది. తమకు అవసరమైన గంజాయిని పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన కొమ్మెర శివ నుంచి కొనుగోలు చేసి కొంతకాలంగా వినియోగిస్తున్నారు. మాచర్లకు చెందిన శివ తన స్నేహితుడు చల్లా అంజి ద్వారా సేకరించిన గంజాయిని తెలిసి వ్యక్తులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో త్రిపురారం మండల కేంద్రంలోని గంగదేవరమ్మ గుడి వద్ద మణికంఠ, వినోద్ కోటేష్‌లకు సుమారు 1.6 కిలోల గంజాయిని శివ విక్రయిస్తుండగా సమాచారం తెలుసుకున్న ఎస్ఐ నరేష్ తన సిబ్బందితో కలిసి దాడిచేసి నలుగురు యువకులను పట్టుకున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. నలుగురు యువకులపై కేసునమోదుచేసి రిమాండ్‌కు పంపగా, ప్రధాన నిందితుడు చల్లా అంజి పరారీలో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. అతడిని కూడా త్వరలో పట్టుకుంటామన్నారు. గంజాయి కేసును ఛేదించిన ఎస్ఐ, సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో హాలియా సీఐ సతీష్‌రెడ్డి, ఎస్ఐ నరేష్, హెడ్‌కానిస్టేబుల్ శ్రీను, పీసీలు చంద్రశేఖర్, నాగేశ్వరరావు, శ్రీనివాస్, హోంగార్డులు రఫీ, చాంద్ పాషా, కవిత, ఇబ్రహీం పాల్గొన్నారు.

మిర్యాలగూడలో ఇద్దరు యువకుల అరెస్టు

గంజాయి రవాణాకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను మిర్యాలగూడ రూరల్ పోలీసులు బుధవారం అరెస్టుచేశారు. ఎస్ఐ లక్ష్మయ్య గురువారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గూడూరు గ్రామానికి చెందిన కారుడ్రైవర్ షేక్ రియాజ్, మిర్యాలగూడ పట్టణం రవీంద్రనగర్‌కు చెందిన కమాజి వంశీ అనే ఇద్దరు యువకులు ఏపీ రాష్ట్రం మాచర్లకు చెందిన అమరలింగం, మిర్యాలగూడ పట్టణం ఎన్నెస్పీక్యాంపుకు చెందిన పులిజాల లక్ష్మీనారాయణల నుంచి 250 గ్రాముల గంజాయిని కొనుగోలు చేస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుల్లో రియాజ్, వంశీ పోలీసులకు చిక్కగా, అమరలింగం, లక్ష్మీనారాయణ పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుల నుంచి ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.



గుట్టలో ఆసుపత్రి వద్ద వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

గుట్టలో ఆర్‌ఎంపీపై క్రిమినల్ కేసు

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతిః) : వైద్యం చేసే అర్హత లేకున్నా యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో ఆర్‌ఎంపీగా చెలామణి అవుతున్న వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదైంది. సీఐ బొడ్డుపల్లి భాస్కర్ గురువారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుట్ట పట్టణంలోని శ్రీరాంనగర్‌కు చెందిన కొంతం సుదర్శన్‌రెడ్డి వైద్యం చేయడానికి ఎలాంటి అర్హత సర్టిఫికెట్ లేకున్నా ప్రైవేట్ వైద్యశాలను ఏర్పాటు చేశాడు. పక్కా సమాచారం మేరకు ఎస్‌వోటీ పోలీసులు దాడులు జరిపి పట్టుకున్నారు. విచారణ జరిపి ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలుశిక్ష, జరిమానా

సూర్యాపేట క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడిన పలువురికి కోర్టు జైలుశిక్ష, జరిమానా విధించినట్లు సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12న సూర్యాపేటలో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించామన్నారు. మోతాదుకు మించి మద్యం తాగి వాహనాలు నడుపుతూ ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారని తెలిపారు. వారిని గురువారం సూర్యాపేట ద్వితీయ శ్రేణి కోర్టులో హాజరుపర్చగా ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా, మరొకరికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బీవీ రమణ తీర్పు చెప్పినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పారిపోయి వచ్చిన విద్యార్థి అప్పగింత

నార్కట్‌పల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అస్వస్థత నెపంతో పాఠశాల నుంచి పారిపోయి వచ్చిన ఓ విద్యార్థిని నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి పోలీసులు పాఠశాల కరస్పాండెంట్‌కు అప్పగించారు. బుధవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. నల్లగొండలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన విద్యార్థి 9వ తరగతి చదువుతూ హాస్టల్‌లోనే ఉంటున్నాడు. రోజు మాదిరిగానే బుధవారం తరగతులకు హాజరైన విద్యార్థికి కొంత నలతగా ఉండటంతో ఉపాధ్యాయులు కూడా విశ్రాంతి తీసుకునేందుకు అనుమతిచ్చారు. అయితే ఇదే అదునుగా విద్యార్థి అందరి కళ్లు గప్పి పాఠశాల గోడ దూకి బయటకువచ్చాడు. కానీ నల్లగొండలోని తన ఇంటికి కూడా వెళ్లకుండా నార్కట్‌పల్లి బస్ స్టేషన్‌కు చేరుకున్నాడు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో హైదరాబాద్‌కు వెళ్లే బస్‌స్టాప్ వద్ద ఒక్కడే కూర్చుని ఉండటాన్ని పోలీసులు గమనించి విచారించడంతో జరిగిందంతా విద్యార్థి వివరించాడు. దీంతో గురువారం తెల్లవారుజామున సదరు విద్యార్థి చదివే పాఠశాల కరస్పాండెంట్‌కు ఫోన్ చేసి పోలీసులు అతడిని సురక్షితంగా అప్పగించారు.

చేపపిల్లల లారీని వెనక్కి పంపిన మత్స్యకార్మికులు

నేరేడుచర్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చేపపిల్లల సంఖ్య తక్కువగా ఉందని మత్స్యకార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సూర్యాపేట నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి సహకార సంఘం సభ్యులు చేపపిల్లల లారీని వెనుకకు పంపించారు. అనంతరం ఆందోళనకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం మండలంలోని చిల్లేపల్లి చెర్వు, చింతకుంట్ల చెర్వులకు చేపపిల్లలు పోసేందుకు చేపపిల్లలను కాంట్రాక్టర్ గురువారం పంపించారు. చిల్లేపల్లి చెర్వుకు 1.44 లక్షల చేపపిల్లలు, చింతకుంట్ల చెర్వుకు 1.20 లక్షల చేప పిల్లలు పంపిణీ చేయాల్సి ఉంది. అయితే చెర్వులలో వదలడానికి వచ్చిన లారీని అనుమానం వచ్చి పరిశీలించగా ఒక డ్రమ్ములో కేవలం 1300 చేపపిల్లలు మాత్రమే ఉన్నాయి. ఈ విధంగా 10డ్రమ్ములలో కేవలం 13వేల చేపపిల్లలు మాత్రమే ఉన్నాయని గుర్తించిన మత్స్యకారులు లారీని వెనుకకు పంపించారు. రెండు చెరువుల మీద ప్రభుత్వానికి ప్రతి ఏటా రూ.3.50 లక్షలు చెల్లిస్తున్నామని, తమకు కేటాయించిన చేపపిల్లలు తీసుకొని రావాలని సొసైటీల సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మత్స్యకార సొసైటీ సంఘం చైర్మన్ నల్లమేకల వెంకయ్య, కార్యదర్శి పిట్టల గోవిందు, బయ్య నర్సయ్య, లచ్చయ్య, నాగరాజు, కృష్ణ, శంకర్ తదితరులున్నారు.

బస్టాండ్‌లో పోలీసుల తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

భువనగిరి టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని భువనగిరి బస్టాండ్‌లో గురువారం రాత్రి పట్టణ పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తుల బ్యాగులు పరిశీలించి వివరాలు సేకరించారు. ప్రయాణంలో ప్రయాణికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బస్టాండ్ బస్సులలో అనుమానంగా సంచరించే వ్యక్తుల సమాచారాన్ని వెంటనే పోలీసులకు ఇవ్వాలన్నారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఎస్ఐలు లక్ష్మీనర్సయ్య, లక్ష్మీనారాయణ, నరేష్, జయరాజు ఆధ్వర్యంలో తనిఖీలు సాగాయి.

పత్తి కూలీల ఆటో బోల్తా

● నలుగురికి తీవ్ర గాయాలు ● 10మందికి స్వల్ప గాయాలు



బుగ్గతండాలో బోల్తా పడిన ఆటో

నేరేడుగొమ్ము, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పత్తి కూలీల ఆటో బోల్తా పడి నలుగురికి తీవ్రగాయాలు కాగా 10మందికి స్వల్ప గాయాలయ్యాయి. గురువారం నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం బుగ్గతండా వద్ద ఈ ప్రమాదం జరిగింది. నేరేడుగొమ్ము ఎస్ఐ కె.నాగేంద్రబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద్దఅడిశర్లపల్లి మండలం పెద్దగుమ్మడం గ్రామానికి చెందిన 13మంది పత్తి కూలీలు 52కిలోమీటర్ల దూరంలో ఉన్న నేరేడుగొమ్ము మండలం కాచరాజుపల్లికి పత్తి ఏరేందుకు ఆటోలో బయలుదేరారు. మార్గమధ్యలో ఆటో మరమ్మతు కావటంతో పెద్దవూర మండలం పులిచర్ల గ్రామానికి చెందిన మరో ఆటోను కిరాయికి మాట్లాడుకుని కాచరాజుపల్లికి బయలుదేరారు. ఆటో నేరేడుగొమ్ము మండలం బుగ్గతండా వద్దకు రాగానే అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదం జరిగిన సమయంలో ఆటోలో డ్రైవర్ బాషా సహా 14మంది ఉండగా, రమణంపల్లి రమేష్, నీలం వెంకటయ్య, బొడ్డుపల్లి కన్నమ్మ, కమలమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. స్వల్ప గాయాలైన రమణంపల్లి మౌనిక, సునంద, అంజమ్మ, మరో ఏడుగురిని 108 వాహనంలో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో రమణంపల్లి రమేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపారు. ఆటోలో పరిమితికి మించి కూలీలను ఎక్కించడం వల్లే ప్రమాద తీవ్రత పెరిగిందని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆటోడ్రైవర్ బాషాపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిండుకుండలా మూసీ ప్రాజెక్టు



వరద నీటితో నిండుగా ఉన్న మూసీ ప్రాజెక్టు

కేతేపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మూసీ ప్రాజెక్టు నీటిమట్టం 645అడుగుల పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరువలో నిలకడగా ఉంది. ఎగువ మూసీ పరివాహక ప్రాంతాలు, హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాలతో పాటు జనగాం, ఆలేరు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు మూసీకి ఉప నదులుగా ఉన్న బిక్కేరు, ఆలేరు వాగులు పొంగి పొర్లడంతో 15రోజుల క్రితం వరకు వరద నీరు మూసీ ప్రాజెక్టుకు భారీగా వచ్చింది. ప్రస్తుతం ఎగువ నుంచి రాక నీటి క్రమంగా తగ్గుతోంది. గురువారం సాయంత్రానికి ఇన్‌ఫ్లో 1642.81క్యూసెక్కులుగా నమోదైంది. 4వ నెంబర్ క్రస్టుగేటు రెండు అడుగుల మేర ఎత్తి 2106.30 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి



జానమ్మ(ఫైల్)

వేములపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : చికిత్సపొందుతూ వృద్ధురాలు మృతిచెందింది. నల్లగొండ జిల్లా వేములపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం వేములపల్లి మండలకేంద్రానికి చెందిన పెదపంగ జానమ్మ(65) ఈ నెల 7న మండలకేంద్రంలోని పీఏసీఎస్ కేంద్రం సమీపంలో నార్కట్‌పల్లి - అద్దంకి రహదారి దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన జానమ్మను మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌కు తరలించారు. కాగా హైద్రాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. ఆమె కుమారుడు లచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

వాహనం ఢీకొని వ్యక్తి

దామరచర్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం బొత్తలపాలెం గ్రామంలో గురువారం రోడ్డు దాటుతున్న వ్యక్తిని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పోలేపల్లి లక్ష్మయ్య(38) నార్కట్‌పల్లి - అద్దంకి రహదారి దాటుతున్న క్రమంలో గుంటూరు నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. లక్ష్మయ్య సోదరుడు రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా మృతుడు అవివాహితుడు.

అదుపు తప్పిన లారీ ఢీకొని

పాలకవీడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలో ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ కోటేష్ తెలిపిన వివరాల ప్రకారం పాలకవీడు మండలం మహంకాళిగూడెం గ్రామానికి చెందిన ఏర్పుల లింగయ్య(45) నల్లగొండ జిల్లా దామరచర్ల మండలకేంద్రంలో ద్విచక్రవాహనం మరమ్మతు చేయించుకుని స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో శూన్య పహాడ్ సమీపంలోకి రాగానే ఎదురుగా అతివేగంగా వచ్చిన కంకరలోడు లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలై లింగయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. లింగయ్యకు భార్యా, కుమార్తె, కుమారుడు ఉన్నారు. లింగయ్య భార్య రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కోటేష్ తెలిపారు.

ధాన్యం కాంటా వేయించేందుకు వెళ్లి ..



శంకరయ్య(ఫైల్)

కనగల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కనగల్ మండల కేంద్రంలో గురువారం పొలం వద్ద నీటిగుంతలో పడి ఓ రైతు మృతి చెందాడు. ఎస్ఐ రాజీవ్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతు(ప్రైవేటుల్యాండ్ సర్వేయర్) నక్కల శంకరయ్య(64) ధాన్యాన్ని కాంటా వేయించేందుకు గురువారం తెల్లవారుజామున మూడో కుమారుడు రాజుతో కలిసి పొలం వద్దకు వెళ్లాడు. తండ్రి శంకరయ్యను ధాన్యం కుప్ప వద్ద ఉండమని చెప్పి రాజు పక్కనే ఉన్న అమ్మగూడెం గ్రామానికి వెళ్లి కాంటాను తీసుకొచ్చాడు. రాజు తిరిగి వచ్చాక తండ్రి శంకరయ్య పొలం వద్ద కనిపించకపోవటంతో చుట్టుపక్కల వెతికాడు. ఈ క్రమంలో పొలం సమీపంలో రోడ్డు పక్కన నీటి గుంతలో పడిపోయిన స్థితిలో తండ్రి కనిపించాడు. దీంతో చుట్టుపక్కల ఉన్న రైతులను ధాన్యం కాంటా వేసే హమాలీలను పిలిచి శంకరయ్యను అందులో నుంచి బయటికితీశారు. అప్పటికే శంకరయ్య మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉంటే శంకరయ్య వ్యవసాయ పనులతో పాటు ప్రైవేట్ సర్వేయర్‌గా పనిచేస్తూ మంచి గుర్తింపు పొందాడు. అతడి మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. మాజీ జడ్పీటీసీలు నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, చిట్లవెంకటేశంగౌడ్, మాజీ సర్పంచ్ సునీతాకృష్ణయ్యగౌడ్ తదితరులు శంకరయ్య మృతదేహం వద్ద నివాళులర్పించారు.

మృతుడి నేత్రాల దానం

కుటుంబ పెద్దను కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్నప్పటికీ శంకరయ్య కుటుంబం సామాజిక బాధ్యతను మరవలేదు. శంకరయ్య నేత్రాలను నల్లగొండ లయన్స్‌క్లబ్ ఆఫ్ చారిటబుల్ ట్రస్ట్-ఐ డొనేషన్‌సెంటర్‌కు దానం చేశారు. ట్రస్ట్ ప్రతినిధులు శంకరయ్య కార్నియాలను సేకరించారు. నేత్రదానంతో మరోఇద్దరికి కంటి చూపును ప్రసాదించవచ్చని లయన్స్‌క్లబ్ ప్రతినిధులు అన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు..

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం తక్కెళ్లపాడు గ్రామంలో గురువారం విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ లక్ష్మయ్య, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన అవివాహితుడు గుండు సురేష్(25) తన ట్రాక్టర్‌లో గడ్డికట్టలు (పశుగ్రాసం) లోడ్ చేసుకొని ఇంటికి తీసుకువస్తున్నాడు. ట్రాక్టర్‌కు అడ్డుగా వచ్చిన విద్యుత్ వైర్లను కర్రసాయంతో తొలగిస్తుండగా, ప్రమాదవశాత్తు సురేష్ చేతిపై పడిందని గ్రామస్థులు తెలిపారు. దీంతో విద్యుదాఘాతానికి గురైన సురేష్ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు వైద్యం కోసం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో సురేష్ కుటుంబంలో విషాదం అలుముకుంది. మృతుడి సోదరుడు గుండు రాము ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి పరిశీలకులుగా మర్యాల వ్యాయామ ఉపాధ్యాయుడు

బొమ్మలరామారం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ మీట్ పరిశీలకులుగా యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం మర్యాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎంపికయ్యారు. ఈ నెల 14న రంగారెడ్డి జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో సికింద్రాబాద్ లోని జింఖానా మైదానంలో రాష్ట్రస్థాయి (ఎస్‌జీఎఫ్) పాఠశాల క్రీడల అండర్-17 బాల బాలికల అథ్లెటిక్స్ మీట్‌ను మర్యాల గ్రామ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు కోనేటి గోపాల్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గోపాల్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, ఎంఈవో రోజారాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పగిడిపల్లి నిర్మలజ్యోతి, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ దశరథరెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించింది.

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

● మెప్మా నల్లగొండ జిల్లా కో-ఆర్డినేటర్ శివాజీ



జనాభాలో సగ భాగం ఉన్న మహిళలు స్వశక్తితో ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా మెప్మా విభాగం పనిచేస్తుందని మెప్మా నల్లగొండ జిల్లా కో-ఆర్డినేటర్ శివాజీ తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సాధించాల్సిన లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. మహిళా సంఘాలు ఏర్పాటు చేస్తామన్నారు. పనిచేసే తీరును బట్టి విడతల వారిగా రుణాలు పెంచుకుంటూ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ విధానంపై పూర్తి అవగాహనతో స్థానిక పరిశ్రమలు నెలకొల్పుకునేలా ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. మహిళా సంఘాల పనితీరు, రుణాల మంజూరుపై ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

● ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ

ఆంధ్రజ్యోతి : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎంత లక్ష్యం సాధించారు?

కో-ఆర్డినేటర్ : జిల్లాలో 1,038 సంఘాలకు రూ.98. 70 కోట్ల రుణాలు అందించాలని లక్ష్యంగా నిర్దేశించగా ఇప్పటి వరకు 776 సంఘాలకు రూ.78.60 కోట్లు బ్యాంకు లింకేజీ కల్పించాం. అధికారుల సహకారంతో వచ్చే డిసెంబరు నాటికే వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేసే దిశగా ముందుకు సాగుతున్నాం. జిల్లాలో నూతనంగా 315 సంఘాలు ఏర్పాటు చేయాలని నిర్దేశించుకుని ఇప్పటికే 273 సంఘాలు ఏర్పాటు చేశాం. మరో 42 సంఘాలు ఏర్పాటు చేస్తే లక్ష్యం పూర్తవుతుంది. జిల్లాలో అర్బన్ ప్రాంతాలైన ఎనిమిది మునిసిపాలిటీల్లో ఇప్పటికే 6,570 సంఘాల్లో 60,456 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు.

ఆంధ్రజ్యోతి : స్థానిక పరిశ్రమల ఏర్పాటుకు ఎలాంటి ప్రోత్సాహం ఇస్తున్నారు?

కో-ఆర్డినేటర్: కొత్తగా వ్యాపారం ప్రారంభించే వారికి, ఉన్న వ్యాపారాన్ని విస్తరించుకునేందుకు రూ.50వేల నుంచి రూ.2లక్షల వరకు సెల్ఫ్ ఎంప్లాయ్ ప్రోగ్రాం(సెప్) కింద బ్యాంకుల నుంచి లింకేజీ ఇస్తున్నాం. మహిళాశక్తి స్కీమ్‌లో ఉన్న మహిళలకు రూ. 3లక్షల వరకు రుణం పొందే అవకాశం కల్పిస్తున్నాం. ఈ ఏడాదిలో 80 యూనిట్లకు రుణం అందించాలని నిర్ణయించి, ఇప్పటి వరకు 73సంఘాలకు రుణాలు అందజేశాం.

ఆంధ్రజ్యోతి : పీఎం ఆత్మనిర్భర్ పథకం కింద ఎంత మంది చిరు వ్యాపారులు లబ్ధిపొందారు?

కో-ఆర్డినేటర్: కోవిడ్ సమయంలో జిల్లాలో 18వేల మంది చిరు వ్యాపారులను గుర్తించాం. వీరికి రూ.10వేల నుంచి రూ.50 వేల వరకు రుణాలు అందించే విధంగా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నాం. వీరిలో పెంచిన రుణం మేరకు మొదటి విడతగా 16వేల మందికి రూ.15 వేలు, రెండో విడత 12వేల మందికి రూ.25 వేలు, మూడో విడతలో 6వేల మందికి రూ.50 వేల రుణాలు ఇచ్చాం. వీరిలో రూ.30 నుంచి రూ.50 వేలు రుణం పొందిన వారికి క్రెడిట్‌కార్డు సౌకర్యం పొందే అవకాశం ఉంది. పూర్తిగా డిజిటల్ లావాదేవీలు చేసిన వ్యాపారులకు సంవత్సరంలో రూ.12 వేలు క్యాష్‌బ్యాక్ వస్తుంది. కొత్తగా 130 మంది వీధి వ్యాపారులను గుర్తించాం.

ఆంధ్రజ్యోతి: పీఎం ఆత్మనిర్భర్ స్కీమ్‌కింద రుణం పొందడానికి నిబంధనలు?

కో-ఆర్డినేటర్: స్వయం ఆధారిత భారత్‌గా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకం అమలు చేస్తోంది. పట్టణానికి చెందిన చిరువ్యాపారి స్థానిక చిరునామాతో ఉన్న ఆధార్‌కార్డు, వ్యాపారం చేసే ఫొటో, బ్యాంకు అకౌంట్ పాస్‌బుక్‌లతో నేరుగా మునిసిపాలిటీలో దరఖాస్తు చేస్తే ఐదు రోజుల్లో రుణం పొందే అవకాశం ఉంది. చిరు వ్యాపారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

వేగం కన్నా ప్రాణం మిన్న

» ప్రమాదాల నివారణకు పోలీసుల వినూత్న ఆలోచన
» వాహనదారులకు అవగాహన కల్పిస్తూ హోర్డింగ్
» ప్రమాదానికి గురైన కారుతో వెలిమినేడు శివారులో ఏర్పాటు




వెలిమినేడు గ్రామ శివారులో ఏర్పాటు చేసిన భారీ హోర్డింగ్

అది 65వ నంబరు రహదారి.. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. తొందరపాటు వేగంతో ప్రమాదమే తప్ప ప్రయోజనం లేదు. ఏమాత్రం పొరపాటు జరిగినా నిండు జీవితం గాలిలో కలిసిపోతుంది. రోడ్డు ప్రమాదాలకు గురై కుటుంబాలు వీధిన పడిన ఘటనలను ప్రత్యక్షంగా చూసిన నల్లగొండ జిల్లా పోలీసులు చలించిపోయారు. జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఆధ్వర్యంలో వినూత్న ఆలోచన చేశారు. వాహనదారులకు అవగాహన కల్పించాలని నిర్ణయించుకున్నారు. అనుకున్నదే తడవుగా చిట్యాల మండలం వెలిమినేడు శివారులో భారీ హోర్డింగ్ ఏర్పాటు చేశారు. ప్రమాదానికి గురై నుజ్జునుజ్జయిన వాహనాన్ని హెచ్చరికగా ఆ హోర్డింగ్‌పై ఉంచారు.

● ఆంధ్రజ్యోతి, చిట్యాలరూరల్

రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల వాహనదారులు వేలాదిగా 65వ జాతీయ రహదారి మీదుగా వెళ్తుంటారు. వేగం, అజాగ్రత్తతో పాటు మద్యం సేవించి, నిబంధనలను ఉల్లంఘిస్తూ, రాంగ్‌రూట్‌లో వస్తూ, సీట్‌బెల్ట్ ధరించకుండా వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతుంటాయి. వాహనదారులు క్షేమంగా గమ్య స్థానాలకు చేరుకొనే విధంగా ఈ హోర్డింగ్ హెచ్చరికలా ఉపయోగపడుతుంది. మితిమీరిన వేగంతో వెళ్లే వాహనదారులకు ఇది మేల్కొల్పులా ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. కొంతైనా మార్పు వస్తే తమ కష్టానికి ఫలితం ఉంటుందని, ప్రమాదాల నివారణ సులువవుతుందని పేర్కొంటున్నారు. పలువురు వాహనదారులు అవగాహన రాహిత్యంతో, మద్యాన్ని సేవించి అజాగ్రత్తతో ఇష్టానుసారంగా నడపడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలను ఓవర్‌టేక్ చేసే సమయంలో చేసే పొరపాట్లతో ప్రమాదం జరుతుంది. ప్రయాణికుల భద్రత, అవగాహనకు వారి సురక్షిత ప్రయాణం కోసం హోర్డింగ్ ఏర్పాటు చేయించారు.

వాహనదారులకు అవగాహన తప్పనిసరి



జాతీయ రహదారిపై వాహనాలను నడిపే వాహనదారులకు అవగాహన తప్పనిసరి. నిబంధనలకు విరుద్ధంగా వేగంగా, అజాగ్రత్తతో వాహనాలు నడుపుతూ వారితో పాటు ఇతర వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తూ ప్రమాదాలబారిన పడేలా వ్యవహరిస్తుంటారు. పోలీసుశాఖ తీసుకుంటున్న నిర్ణయం వాహనదారులకు ఉపయోగపడుతుంది.

- అరూరి శ్రీశైలం, వెలిమినేడు, చిట్యాల.

ఎస్పీ ఆదేశాల మేరకు హోర్డింగ్ ఏర్పాటు



జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు అవగాహన కోసం జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు హోర్డింగ్‌ను ఏర్పాటు చేశాం. వాహనదారులకు స్పష్టంగా కనిపించేలా మండలంలోని నల్లగొండ జిల్లా సరిహద్దు ప్రాంతంలో రహదారి పక్కన ఏర్పాటు చేశాం. హోర్డింగ్‌పై ప్రమాదానికి గురైన వాహనంతోపాటు సూచనలతో కూడిన భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేశాం. ఎస్పీ ప్రత్యేక చొరవతో, రాష్ట్రంలోనే మొదటిసారిగా జిల్లా సరిహద్దు ప్రాంతంలో హోర్డింగ్ ఏర్పాటు చేశాం.

- కైగూరి నాగరాజు, సీఐ నార్కట్‌పల్లి.

ప్రమాదాలు తగ్గుతాయని ఆశిస్తున్నాం



రహదారిపై ప్రమాదాల తగ్గుదల కోసం వెలిమినేడు శివారులో రహదారి పక్కన హోర్డింగ్ ఏర్పాటు చేశాం. వాహనదారులకు అవగాహన కోసం ఫ్లెక్సీ వద్ద ప్రమాదానికి గురైన వాహనాన్ని కూడా ఏర్పాటు చేశాం. ఎస్పీ శరత్‌చంద్రపవార్ ప్రత్యేక చొరవ తీసుకుని హోర్డింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. హోర్డింగ్ వల్ల ప్రమాదాలు తగ్గుతాయని ఆశిస్తున్నాం.

- మామిడి రవికుమార్, ఎస్ఐ చిట్యాల.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు



యాదగిరిగుట్ట, నవంబరు 13(ఆంధ్ర జ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్యక్షేత్రంలో గురువారం పూజలు వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో ఉత్సవ మూర్తులను దివ్య మనోహరంగా అలంకరించారు. గజవాహన సేవలో స్వామిఅమ్మవారికి వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం నిర్వహించారు. దేవతా మూర్తులను కల్యాణ మండపంలో అధిష్టింపజేసి, విష్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొల్పిన అర్చకులు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో జరిగాయి. కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.22,47,036ల ఆదాయం సమకూరినట్లు ఈవో వెంకట్రావు తెలిపారు. వ్రత మండపాల్లో 640మంది జంటలు సత్యదేవుని వ్రతాల్లో పాల్గొన్నాయి. కొండపైన, కింద కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

రెండు టికెట్ ప్రింటింగ్ మిషన్లు అందజేత

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో అధునిక ఎలక్ట్రానిక్ పరికాల వినియోగం ద్వారా టికెట్ల ధ్రువీకరణ వ్యవస్థ మరింత సమర్థంగా నిర్వహించాలని ఆలయ ఈవో వెంకట్రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తి తెలిపారు. కంట్రోల్ టెక్నో సొల్యూషన్, టీవీఎస్ ఎలక్ట్రానిక్ సంస్థలు సంయుక్తంగా ఆలయ ప్రధాన కార్యాలయంలో గురువారం టికెట్ మిషన్లు అందజేశాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.50వేల(హ్యాండ్ హెల్డ్ టికెట్ ప్రింటింగ్, క్యూఆర్ కోడ్ వాలిడేషన్ మిషన్లు) విలువైన రెండు టికెట్ ఎలక్ట్రానిక్ మిషన్లను రూ.300 బ్రేక్, రూ.150 ప్రత్యేక దర్శనాల టికెట్ కోసం వినియోగిస్తామన్నారు. కార్యక్రమంలో టీవీఎస్ టెక్నీషియన్ సరోజ్‌కుమార్ సాహు పాల్గొన్నారు.

మట్టపల్లిలో శివకేశవులకు ఆరాధనలు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శివకేశవుల ఆలయాల్లో హరిహరులకు విశేష ఆరాధనలు నిర్వహించారు. ఉదయం స్వామికి పంచసూక్త విధానంగా అభిషేకాలు చేపట్టాక ఆరె పత్రితో అష్టోత్తర నామార్చనలు, ఆర్జిత సేవలు నిర్వహించారు. యాగ మండపంలో సుదర్శన సహిత హోమాధికాలు పూర్తయ్యాక క్షేత్రపాలకుడు క్షేత్రపాలకుడు వాయునందనునికి సహస్ర నాగవల్లీ దళార్చన, వడమాల సమర్పణలు, గావించారు. మహాక్షేత్రంలో భక్తుల ఆధ్వర్యంలో నిత్యకల్యాణం శాస్త్రో క్తంగా జరిపించి దివ్యమూర్తులను ఆలయ ప్రదక్షిణ చేయించారు.

సాధారణ భక్తులకే ప్రాధాన్యం

● దేవస్థానం పరిధిలో ఫ్లెక్సీలు నిషేధం ● లీజులు, టెండర్లు పారదర్శకంగా నిర్వహించాలి ● ఈవో వెంకట్రావు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న గుట్ట ఆలయ ఈవో వెంకట్రావు

యాదగిరిగుట్ట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట క్షేత్ర దర్శనాలకు వచ్చే సాధారణ భక్తులకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు అన్నారు. అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తితో కలిసి యాదగి రికొండ ప్రధాన కార్యాలయంలో అధికారులతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో దర్శనాల కోసం ఎటువంటి సిఫారసు లేఖలు అనుమతించబోమని చెప్పారు. వీఐపీలు ముందస్తుగా లేఖలు అందజేసిన ప్రముఖులకు మాత్రమే ప్రొటోకాల్ వర్తిస్తుందన్నారు. ఆదేశాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. శని, ఆది, సోమవారాల్లో భక్తుల రద్దీ నేపథ్యంలో చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానాలయంలో సంప్రోక్షణ కార్యక్రమానికి భక్తులు సంతోషం వ్యక్తం చేస్తుండగా, ఇంకా ఇద్దరు పూజారులను నియమించాలని సూచించారు. ప్రతి సోమవారం శివాలయంలో ప్రసాద వితరణ కార్యక్రమం కొనసాగాలన్నారు. ప్రధానాలయంలో అందించే ప్రసాద వితరణలో పరిణామం పెంచడంతో పాటు నాణ్యత, రుచితో అందించాలన్నారు. దేవస్థాన పరిసరాలు, కొండకింద ఆలయ పరిధిలో ఎలాంటి ఫ్లెక్సీలు, ప్రైవేట్ ప్రకటనల కోసం వినియోగించొద్దని ఆదేశించారు. వాటిని నిషేధిస్తున్నట్లు తెలిపారు. ఆలయ భూములు, ఖాళీ ప్రదేశాలు ఆక్రమణకు గురికాకుండా ప్రహరీ, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అనధికారంగా దుకాణాలు, ఇతర స్టాళ్లు దేవస్థాన పరిధిలో ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయానికి సంబంధిం చిన టెండర్లు, లీజు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. దేవస్థానం దుకాణ సముదాయాల్లో ధరల పట్టిక ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవోలు ప్రతాప నవీన్‌కుమార్‌శర్మ, గజ్వెల్లి రఘు, జూశెట్టి క్రిష్ణ, జాటోత్ శంకర్‌నాయక్, ప్రధానార్చకుడు భట్టర్ సురేంద్రా చార్యులు, సివిల్ విభాగం ఈఈ జిల్లెల దయాకర్‌రెడ్డి, పర్యవే క్షకులు మాచర్ల రాజన్‌బాబు, వాసం వెంకటేశ్వర్లు, దాసోజు నరేష్, నటరాజు, దొమ్మాట సురేందర్‌రెడ్డి, శ్రీలత ఉన్నారు.

17 నుంచి పత్తి మిల్లుల నిరవధిక బంద్



మోత్కూరులో పత్తి మిల్లు గేటుకు కట్టిన బ్యానర్

మోత్కూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సీసీఐ కఠిన నిబంధనల నేపథ్యంలో ఈ నెల 17 నుంచి పత్తి మిల్లుల నిరవధిక బంద్ నిర్వహించనున్నట్లు పత్తి మిల్లుల యజమానులు తెలిపారు. పత్తి మిల్లులను ఎల్-1, ఎల్-2, ఎల్-3 పేరుతో మూడు విభాగాలుగా విభజించి కొన్ని పత్తి మిల్లుల్లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, మరికొన్ని మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదన్నారు. గతంలో ఎకరాకు 12 క్వింటాళ్ల పత్తికొనుగోలు చేయగా ఈసారి ఎకరాకు 7క్వింటాళ్ల పత్తి మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. మిగతా పత్తి ఎక్కడ విక్రయించాలని రైతులు పత్తి కొనుగోలు కేంద్రంలో బయ్యర్లతో, మిల్లు యజమానులతో తగాదా పడుతున్నారు. 8 నుంచి 12 తేమ శాతం ఉన్న పత్తినే కొనుగోలు చేయాలన్న నిబంధనను సడలించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కూడా గతంలో సీసీఐ సీఎండి దృష్టికి తీసుకెళ్లారు. అయినా సీసీఐ తన నిబంధనలు సడలించలేదు. ఎల్-1, ఎల్-2, ఎల్-3 విధానం, ఎకరాకు ఏడు క్వింటాళ్లు మాత్రమే కొనాలన్న నిబంధనలకు వ్యతిరేకంగా పత్తి మిల్లుల యజమానులు ఈ నెల 7నుంచే నిరవధిక బంద్ నిర్వహించాలని నిర్ణయించగా సీసీఐ అధికారులు చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇవ్వడంతో అప్పుడు బంద్ విరమించారు. ఇప్పటి వరకు కూడా ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ఈ నెల 17 నుంచి నిరవధిక బంద్ పాటించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర కాటన్ అసోసియేషన్ సీసీఐకి, వ్యవసాయ శాఖ మంత్రికి నోటీసులు ఇచ్చింది. ఈ నెల 17నుంచి పత్తి మిల్లులు బంద్ చేస్తామని, రైతులు స్లాట్ బుక్ చేసుకోకుండా సహకరించాలని పత్తి మిల్లుల యాజమానులు కోరారు. 8 నుంచి 12వరకు ఉన్న తేమశాతం నిబంధనను కూడా 16 శాతానికి సడలించాలని పత్తి రైతులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం వడ్డించాలి

● ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్యాంసుందర్ ● పోచంపల్లి బాలికల పాఠశాలలో భోజనం పరిశీలన



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎస్సీ కార్పోరేషన్ ఈడీ శ్యాంసుందర్

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 13, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన ఆహారం వడ్డించాలని ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి. శ్యాంసుందర్ అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ఆయన మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరును పరిశీలించారు. వండిన ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి మెనూ ప్రకారం పెడుతున్నారా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారమే పెడుతున్నారని ఆయన నిర్ధారణ చేసుకుని విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానం రాబట్టారు. ఉపాధ్యాయులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం పాఠశాలలోని మరుగుదొడ్లను పరిశీలించి, పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వి. శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తీర్ణత శాతం పెంచాలి

యాదగిరిగుట్ట రూరల్: విద్యార్థులు ఇష్టంతో చదివి ఉత్తీర్ణశాతాన్ని పెంచాలని ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ కృష్ణఆదిత్య, బోర్డు జాయింట్ సెక్రెటరీ ప్రత్యేక అధికారి భీమ్‌సింగ్ అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం పరిశీలించారు. 90 రోజుల ప్రణాళికలో భాగంగా విద్యార్థులతో మాట్లాడారు. ప్రతిరోజూ తరగతులకు హాజరై ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి ఆదర్శంగా ఉంటూ అడ్మిషన్లు పెరిగేందుకు తోడ్పాటు అందించాలని సూచించారు. అనంతరం కళాశాలలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి. మంజుల, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



విజేతలకు బహుమతులు అందజేసిన పూర్వ విద్యార్థి చక్రపాణి

నాగార్జునసాగర్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని నాగార్జునసాగర్ బీసీ గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థి, గ్లోబల్ హెల్త్ ఎంక్వయిరీ బిజినెస్ ఏషియా పసిఫిక్ అండ్ జపాన్ రీజనల్ మేనేజర్ డాక్టర్ చక్రపాణి అన్నారు. ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో నిర్వహించిన అండర్-14,19 జిల్లాస్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేశారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో నిత్య సాధన చేస్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని, అందుకు వ్యాయమ ఉపాధ్యాయుల సలహాలు తీసుకుంటూ క్రీడల్లో సాధన చేయాలన్నారు. తాను చదువుకున్న పాఠశాలకు ముఖ్య అతిథిగా వచ్చి క్రీడాకారులకు బహుమతులు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. అండర్ -19 విభాగంలో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను మునుగోడు బీసీ గురుకుల పాఠశాల సాధించింది. అండర్-14 విభాగంలో ఓవరాల్ చాంపియన్ షిప్‌గా సాగర్ బీసీ గురుకుల పాఠశాల నిలిచింది.

బుద్ధవనం అద్భుతం



బుద్ధవనంలో ఎంపీ కేసరిదేవ్ సిన్హా

నాగార్జునసాగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ హిల్ కాలనీలో నిర్మించిన బుద్ధవనం అద్భుతమని గుజరాత్ ఎంపీ కేసరిదేవ్ సిన్హా అన్నారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని బుధవారం రాత్రి సందర్శించారు. బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం బుద్ధవనంలో చరిత వనం, ధ్యాన వనం, జాతక వనం, స్థూపవనం, మహా స్థూపాలను తిలకించారు. ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర బుద్ధవనం విశేషాలను ఎంపీకి వివరించారు. ఆయన వెంట నల్లగొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఉన్నారు.

కలుపు మొక్కతో రైతుల్లో కలవరం

● పంటపొలాల్లో సికిల్‌పోడ్ కలుపు మొక్క ● కట్టడికి రైతుల అష్టకష్టాలు ● పంట దిగుబడిపై ప్రభావం చూపుతోందని ఆవేదన



పంట పొలాల్లో కలుపు మొక్కలు కలవరపెడుతున్నాయి. వాటి నివారణకు వేలాది రూపాయలు వెచ్చించి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. పంట ఎదుగుదలపై ప్రభావం చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు గుదిబండగా మారిన వయ్యారిభామ (పార్థీనియం) కలుపు మొక్కను నివారించేందుకు అన్నదాతలు అష్టకష్టాలు పడుతుండగా, మరో కలుపు మొక్క పుట్టుకొచ్చింది. సికిల్‌పోడ్ అనే కలుపు మొక్క వనాలు, వనాలుగా పెరుగుతోంది.

(ఆంధ్రజ్యోతి, రాజాపేట)

సికిల్‌పోడ్ మన దగ్గర కలుపు మొక్కే. కానీ కొన్ని ఇతర దేశాల్లో ఔషధంగా వాడతారు, మొక్క విత్తనాలు ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి జంతువులు, యంత్రాల ద్వారా వ్యాప్తి చెందుతున్నాయి. యంత్రాలతో పనులు చేసినప్పుడు యంత్రాలకు విత్తనాలు చిక్కుకుని వేరే ప్రాంతానికి వ్యాపిస్తున్నాయి. వర్షాకాలంలో ఎక్కువగా పెరుగుతాయి. బీడు భూములు, పంట పొలాల్లో పెరుగుతుంది. రహదారుల వెంట విరివిగా పెరుగుతుంది. సికిల్‌పోడ్ అనే మొక్క అమెరికాకు చెందినది. సెన్నా అబ్బు సిఫోలియా జాతికి చెందినది. సికిల్‌పోడ్ అంటే కొడవలి ఆకారం అని అర్థం. ఈ మొక్క అన్ని ప్రాంతాల్లో పెరుగుతుంది. విత్తనాల ద్వారా మొలకెత్తి వ్యాపిస్తుంది. గాలి, జంతువుల ద్వారా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతం వరకు వృద్ధి చెందుతుంది. కొడవలి ఆకారంలో కాయలు కాస్తూ లోపల గింజలను ఉత్పత్తి చేస్తుంది.

మొక్కతో కలిగే నష్టాలు: పత్తి, సోయాబీన్ పంటల్లో పెరగడంతో సోయాబీన్ పంటపై ప్రభావం చూపుతుంది. గింజల్లో నూనె శాతాన్ని తగ్గిస్తుంది. మొక్కలు పెరిగి పూర్తిగా పరుచుకుని ఉండడంతో పశుగ్రాసం పెరగడం లేదు. పొదలు పొదలుగా పెరగడంతో ఇతర మొక్కల పెరుగుదలను అడ్డుకుంటాయి.

నివారణకు భువనగిరి ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త మధుశేఖర్ సూచనలు : సికిల్‌పోడ్ పప్పు జాతికి చెందినది. కొన్ని దేశాల్లో దీనిని ఔషదాల్లో వినియోగిస్తారు. ఈ మొక్కలు వ్యాప్తి చెందకుండా రైతులు మొక్కలు చిన్నగా ఉన్నప్పటి నుంచే తొలగించాలి. పూత దశకు ముందు నుంచే తొలగించాలి. కలుపు మొక్కల నివారణకు వాడే కొన్ని మందులు వాడి అరికట్టవచ్చు. 2,4-డి, గ్లైఫోసేట్ మందు, పారాక్వాట్ మందును లీటరు నీటిలో 3.5 ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలి.

కలుపు మొక్కలతో ఇబ్బందులు పడుతున్నాం



కలుపు మొక్కలతో ఏటేటా నష్టపోతున్నాం కొంత కాలం వయ్యారిభామ మొక్కతో ఇబ్బందిపడ్డాం. దానిని తొలగించేందుకు ముందులు పిచికారీ చేసినా పూర్తిస్థాయిలో నివారించలేదు. ఇప్పుడు సికిల్‌పోడ్‌తో ఇబ్బంది పడుతున్నాం. పంట పొలాలు, బీడు భూముల్లో ఎక్కువగా పెరుగుతుంది. దీని ప్రభావం పశుగ్రాసం పెరుగుదలపై పడుతోంది.

● ముక్కెర నాగేశ్వర్‌రెడ్డి, రైతు, కుర్రారం

మోడల్ ఇల్లే పూర్తికాలే..!

● అసంపూర్తిగా ఇందిరమ్మ ఇల్లు

● ప్రభుత్వ కార్యాలయ ఆవరణలోనే అశ్రద్ధ..!

చండూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పథకాన్ని ప్రవేశపెట్టింది. అందులో భాగంగా తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిర్మించ తలపెట్టిన ఇందిరమ్మ నమూనా ఇంటి పనులు నేటికీ పూర్తి కాలేదు. సుమారు ఏడు నెలల క్రితం ప్రారంభించిన ఈ నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అలసత్వం వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. ఇలాంటి సమయంలో ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన నమూనా ఇంటిని పూర్తి చేయకుండా వదిలేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నమూనా నిర్మాణానికి నెలలు గడుస్తున్నా పూర్తి చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణంలోనే ఈ పరిస్థితిఉంటే, లబ్ధిదారులకు ఇళ్ల పనులు ఏ స్థాయిలో జరుగుతాయనే సందేహాలు వెలువడుతున్నాయి.



తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో అసంపూర్తిగా నిర్మించిన ఇందిరమ్మ నమూనా ఇల్లు

ఇంటి నిర్మాణం ఇలా...

ఇందిరమ్మ ఇళ్లను ఖచ్చితంగా 400-600 చదరపు అడుగుల మధ్యలోనే నిర్మించుకోవాలి. ప్రభుత్వం అందించే రూ.5లక్షలతోనే నిర్మాణం పూర్తయ్యేలా ప్రతీ మండలంలో నమూనా ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. లబ్ధిదారులు తమకు నచ్చిన ఆకృతిలో భాగంగా నిర్మాణంలో ప్రభుత్వం మార్పులు చేసుకునే వీలు కల్పించింది. కానీ విస్తీర్ణం మాత్రం పెంచకూడదని స్పష్టం చేసింది.

45 రోజుల్లో పనులు ప్రారంభించాలి

చండూరు మండల వ్యాప్తంగా మొదటగా 334 మంది లబ్ధిదారులను ఎంపిక చేసింది. వారిలో 37 మంది లబ్ధిదారులు 45 రోజులైనా ఇంటి నిర్మాణం ప్రారంభించకపోవడంతో వారిని తొలగించారు. చండూరు మునిసిపాలిటీలో 200 మంది లబ్ధిదారులను అధికారులు ఎంపిక చేయగా అవి పునాది దశలోనే ఉన్నాయి. ఇంటి నిర్మాణం మంజూరైన లబ్ధిదారులు 45 రోజుల్లో ప్రారంభించకుంటే వారి పేర్లను జాబితాలో నుంచి అధికారులు ఇప్పటికే తొలగించారు.

లేబర్ కొరతతో పనులు ఆలస్యం

మండలంలో ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేలా లబ్ధిదారులపై ఒత్తిడి చేస్తూ, దశల వారీగా బిల్లులు చెల్లిస్తున్నాం. 80శాతం నిర్మాణాలు పూర్తి కావొస్తున్నాయి. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న ఇందిరమ్మ ఇంటి నమూనా నిర్మాణం తుది దశలో ఉంది. లేబర్ కొరతతో ఆలస్యమవుతుంది. కాంట్రాక్టర్‌పై ఒత్తిడి చేసి కొద్ది రోజుల్లోనే పనులు పూర్తి చేసేలా కృషి చేస్తా.

- వి.వరుణ్, ఏఈ, గృహ నిర్మాణశాఖ, చండూరు

నిధుల కొరతే కారణమా..?

ఒకవైపు ఇప్పటికే పలువురు ఇందిరమ్మ లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని, నాయకుల చేతుల మీదుగా ప్రారంభోత్సవాలు కూడా చేసుకునే దశలో ఉన్నారు. కానీ ఇందిరమ్మ నమూనా ఇల్లు మాత్రం పూర్తి కావడం లేదు. నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోవడానికి కారణం ఏమిటనే దానిపై స్థానిక అధికారుల్లో స్పష్టత కొరవడింది. నిధులు సకాలంలో విడుదల కాకపోవడమే సమస్యకు మూలమని కొందరు కింది స్థాయి సిబ్బంది చెబుతుండగా, పర్యవేక్షణ బాధ్యత వహించాల్సిన అధికారుల అలసత్వం కారణంగానే ఈ జాప్యం జరిగిందని మరికొందరు ఆరోపిస్తున్నారు. ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని సైతం పూర్తి చేయలేని స్థితిలో మండల పాలనా యంత్రాంగం ఉందా అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

సదరం సర్టిఫికెట్ల అందజేత

శాలిగౌరారం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం ఇటుకులపహాడ్ గ్రామానికి చెందిన అక్కా, తమ్ముడు జిల్లోజు పూలమ్మ, జిల్లోజు రాములు పుట్టుకతోనే మూగవారు. వీరు మూగవారు అయినా సదరం సర్టిఫికెట్ లేదు. వివిధ పత్రికల్లో వచ్చిన కథనాలకు అధికారులు స్పందించారు. వెంటనే జిల్లా సదరం అధికారులు గ్రామాన్ని సందర్శించి పుట్టుకతోనే మూగ అక్క జిల్లోజు పూలమ్మకు, తమ్ముడు జిల్లోజు రాములుకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

త్వరలోనే సర్టిఫికెట్లు అందజేస్తామని ఇచ్చిన హామీ మేరకు శాలిగౌరారం ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి గురువారం గ్రామంలోని మూగ అక్క జిల్లోజు పూలమ్మకు, తమ్ముడు జిల్లోజు రాములుకు సదరం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుల్తాన్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

చేనేతల ధర్నాను విజయవంతం చేయాలి



చేనేత కార్యాలయ ముట్టడి పత్రాన్ని ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వర్లు

నార్కట్‌పల్లి, నవంబరు 13, (ఆంధ్రజ్యోతి): చేనేతల రుణమాఫీలో ప్రభుత్వ తాత్సారాన్ని నిరసిస్తూ ఈనెల 20వ తేదీన నిర్వహించే చేనేత కమిషనర్ కార్యాలయ ముట్టడిని జయప్రదం చేయాలని తెలంగాణ చేనేత ఐక్యవేదిక జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పోచం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ముట్టడికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గురువారం నార్కట్‌పల్లిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జియోట్యాగింగ్ చేయబడని ప్రతీ చేనేత కార్మికుడికి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయాలని వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. కమిషనర్ కార్యాలయ ముట్టడిని చేనేత కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మునిపంపుల చేనేత సహకార సంఘం డైరెక్టర్ రాపోలు వెంకటేశం, వనం మార్కొండేయ, దేవులపల్లి మల్లేశం, వనం నర్సింహ్మ, కొక్కుల లక్ష్మమ్మ, లలిత న్నారు.

సాయిబాబా ఆలయంలో కార్తీక దీపాలు

చిట్యాలరూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వట్టిమర్తి బస్‌స్టేజీ సమీపంలో గల సాయిబాబా ఆలయంలో గురువారం భక్తులు ఓంకారం, స్వస్తిక్ ఆకారంలో కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం పూజాకార్యక్రమాలు, సాయివ్రతాల్లో పాల్గొని మధ్యాహ్న హారతికి హాజరై మంగళహారతులు తీసుకుని సాయిబాబా దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. బాబా దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నదాతల సౌజన్యంతో అన్నవితరణ చేశారు.



కార్తీక ప్రమిదలు వెలిగిస్తున్న భక్తులు

బీసీల ధర్మ పోరాట దీక్ష

మునుగోడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించిన బిల్లును కేంద్ర ప్రభుత్వం తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని బీసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు మునుగోడు స్థానిక జేఏసీ ఆధ్వర్యంలో బీసీ ధర్మ పోరాట దీక్ష చేశారు. బీసీలకు రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేంత వరకు ఆందోళన కొనసాగుతోందని తెలిపారు. కార్యక్రమంలో బూడిద లింగయ్యయాదవ్, గుంటోజు వెంకటాచారి, ఆనగంటి కృష్ణ, కైలాసంగౌడ్, మిర్యాల వెంకన్న, సాగర్ల మల్లేష్, పెంబళ్ల జానయ్యయాదవ్, గుర్రం యాదయ్య, జిల్లపెల్లి యాదయ్య, యాసరాణి శ్రీను, నాగేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పంటల కొనుగోలులో ఆంక్షలు ఎత్తివేయాలి

మునుగోడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పత్తి, వరి ధాన్యం వంటి వివిధ పంటల కొనుగోలులో ఆంక్షలు ఎత్తి ఎత్తివేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురిజ రామచంద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు సీసీఐ కేంద్రానికి విక్రయించిన తీసుకొచ్చిన పత్తికి తేమ శాతం ఉండాలని చూపుతూ వివిధ రకాల కొర్రీలు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. వరి, రైతుల పరిస్థితి అట్లే ఉందన్నారు. ఈకారణంగా రతైలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. తుఫాన్, అకాల వర్షాలకు పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, పండిన కొద్ది పాటి పంటలను అమ్ముకోవటంలో రైతులు తీవ్ర అగచాట్లకు గురవుతున్నారని అన్నారు. పండిన పంటలను లెక్కగడితే కనీసం పెట్టుబడులు మిగిలే పరిస్థితులు లేవని అన్నారు. రైతులు పండించిన పంటల అమ్మకాన్ని ఆంక్షలు లేకుండా కొనుగోలుకు చర్యలు తీసుకోవాలన్నారు.

సమగ్ర శిక్ష సిబ్బందిని బాధ్యులను చేయడం తగదు



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

కేతేపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూలు జిల్లా పెద్దకొత్తపల్లిలో పాఠ్యపుస్తకాలు తీసుకెళుతున్న ఆటో బోల్తాపడి విద్యార్థులు గాయపడిన ఘటనకు సమగ్రశిక్ష ఉద్యోగులను బాధ్యులను చేయడం సరైందికాదని సీఆర్పీల సంఘం రాష్ట్ర కోశాధికారి, సమగ్రశిక్ష ఉద్యోగుల రాష్ట్ర కార్యదర్శి కంచర్ల మహేందర్ అన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల తొలగింపును నిరసిస్తూ గురువారం కేతేపల్లి ఎమ్మార్సీ ఎదుట సమగ్రశిక్ష ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ ఆటోబోల్తా పడి విద్యార్థులు గాయపడడం బాధకరమైనప్పటికీ అనేక ఏళ్ళుగా విద్యాశాఖలో కాంట్రాక్టు ఉద్యోగులుగా సేవలు అందిస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులను బాధ్యులను చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మానవతా దృక్పథంతో ఎమ్మార్సీ సిబ్బంది తొలగింపు ఉత్తర్వులను ఉపసంహరించాలని ఆయన కోరారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో సంఘం నాయకులు సైదులు, సునీత, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలి

నల్లగొండరూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వెల్ఫేర్ బోర్డు స్కీంలను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇస్తూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని కార్మిక సంఘాల నాయకులు పల్లా దేవేందర్‌రెడ్డి, చినపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జేఏసీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక అంబేద్కర్ భవనంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం భవన నిర్మాణ బోర్డు ద్వారా అమలవుతున్న ఇన్సూరెన్స్ స్కీములను జీవో నెం 12ద్వారా ప్రైవేట్ ఇన్సూరెన్స్‌లకు ఏమిటని ప్రశ్నించారు. ఇలా చేయడం వల్ల కార్మికులకు అన్యాయం చేయడమేనన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25వ తేదీన కలెక్టర్ కార్యాలయం ఎదుట, డిసెంబరు 5న చలో లేబర్ కమిషనర్ కార్యాలయం కార్యక్రమాలను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు నూనె రామస్వామి, ఎండీ సలీం, రవిందర్, దోటి వెంకన్న, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు

శాలిగౌరారం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు జరుగుతాయని, వాటిని నివారించేందుకు బాల్య వివాహాలను అరికట్టాలని బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ ఎస్.రేవతి అన్నారు. మండల పరిధిలోని వల్లాల గ్రామంలోని ఆదర్శ పాఠశాలలోని విద్యార్థినులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రేవతి మాట్లాడుతూ అక్రమ దత్తత, చట్టబద్ధమైన దత్తత గురించి, భ్రూణ హత్యలు, లైంగిక వేధింపులు, అక్రమ రవాణా, రక్తహీనత, పోషణ, న్యూట్రిషన్ తదితర అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్లు సునీత, అంగన్‌వాడీ టీచర్లు రామలక్ష్మి, శోభరాణి తదితరులు పాల్గొన్నారు.



వల్లాల మోడల్ స్కూల్‌లో విద్యార్థులు అవగాహన కల్పిస్తున్న రేవతి

చిట్యాలరూరల్: చిట్యాల మండలంలోని వట్టిమర్తి జడ్పీహెచ్‌ఎస్‌లో బాల్యవివాహాలపై గురువారం జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ ఆశ్రిత సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్యవివాహాలకు వ్యతిరేకంగా 100రోజుల క్యాంపెయిన్‌లో భా గంగా బాల్యవివాహాలు చేస్తే వచ్చే అనర్థాలు, నష్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆడపిల్లలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాల లోపు ఉన్న వారికి వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం యాదయ్య, సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నకిరేకల్ మండలంలోని కడపర్తిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీవో ఎన్‌బీసీ విద్య, సూపర్‌వైజర్ భవాని

200 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం



పులిపలుపుల రైతు వేదికలో మాట్లాడుతున్న అధికారులు

చిట్యాలరూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్ పరిధిలో 200ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంట సాగును సాగు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని చిట్యాల పీఏసీఎస్ ఛైర్మన్ సుంకరి మల్లేష్‌గౌడ్ అన్నారు. చిట్యాల పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని వట్టిమర్తిలో గురువారం ఆయిల్‌పామ్ పంటల సాగుపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. రైతులు ధాన్యం, పత్తిపైనే ఆధారపడకుండా ఇతర పంటల సాగుపై దృష్టిని సారించాలన్నారు. ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని, దానికి సబ్సిడీ కూడా ఉంటుందన్నారు. ఆయిల్‌పాం సాగు లాభదాయకంగా ఉంటుందని సూచించారు. మండల ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి శ్వేత మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు అధిక దిగుబడి ఇస్తుందని తెలిపారు. రైతులు అన్ని పంటలకు ఇచ్చే ప్రాధాన్యత ఆయిల్‌పామ్‌కు కూడా ఇవ్వాలని అన్నారు. మొక్కలపై 90శాతం రాయితీ, డ్రిప్‌పై బీసీలకు 90 శాతం, ఎస్సీ, ఎస్టీలకు పూర్తి రాయితీ ఉంటుందన్నారు. రైతులు ఆయిల్‌పాం సాగుపై దృష్టిని సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిట్యాల మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ నర్రా వినోద, పీఏసీఎస్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ జ్యోతిర్మయి, పీఏసీఎస్ డైరెక్టర్ నర్రా మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుతో లాభాలు

మునుగోడు రూరల్: మండలంలోని పులిపలుపుల రైతు వేదికలో మునుగోడు మండల డివిజన్ ప్లాంటేషన్ ఆఫీసర్ ప్రసాద్ ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఎకరానికి 57 మొక్కలను నాటుకోవచ్చని, వరి కంటే ఎక్కువ లాభాలు పొందవచ్చని అన్నారు. ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని అన్నారు. సదస్సులో పులిపలుపుల క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి ఎం.నరసింహ, పతంజలి ప్లాంటేషన్ ఆఫీసర్ ప్రసాద్, హెచ్‌ఈవో శ్రీనివాస్, పీఏసీఎస్ సీఈవో సుఖేందర్, సిబ్బంది అశోక్‌రెడ్డి, లింగస్వామి, చంద్రశేఖర్ స్వామి, యాదయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చదువు సాగేదెలా?

(5వ పేజీ తరువాయి)

భోజనంలోనూ నాణ్యతా ప్రమాణాలు పాటించడంలేదని పలువురు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. వీటిని సంక్షేమశాఖ అధికారుల సైతం పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం

బీఏఎస్ స్కీంలో ఎంపికైన విద్యార్థుల ఫీజులు ప్రభుత్వం నుంచి రాకపోవడంతో యాజమాన్యాలు పాఠశాలకు రానివ్వకపోతే పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి సమస్యను కలెక్టర్‌కు వివరించాం. ఆమె ఆదేశాల మేరకు విద్యార్థులు పాఠశాలలకు వెళ్తున్నారు. చాలా పాఠశాలల్లో ప్రభుత్వం ఫీజులు ఇవ్వలేదనే కారణంతో తల్లిదండ్రుల నుంచి పుస్తకాలు, షూ, హాస్టల్ తదితర అవసరాల కోసం డబ్బు వసూలు చేశారు. వీటిపై జిల్లా అధికారులు కమిటీ వేసి చెల్లించిన డబ్బును పేద విద్యార్థులకు తిరిగి ఇప్పించాలి.

- గిరిబాబు, పేరెంట్స్ కమిటీ సభ్యుడు

చాలా అన్యాయం

రాష్ట్ర బడ్జెట్‌లో నిరుపేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల చదువులకు అయ్యే నిధులను విడుదల చేయకపోవడం అన్యాయం. ప్రభుత్వం అరకొర నిధులు విడుదల చేయడంతో నిరుపేద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ప్రైవేట్ పాఠశాలలు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేసి బెస్ట్ అవైలబుల్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలి.

- పాలడుగు నాగార్జున, కేవీపీఎస్ నేత

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

నల్లగొండ టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ (టాప్రా) సౌజన్యంతో శుక్రవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పందిరి శ్యాంసుందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ భవన్‌లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్య పరీక్షలు మ్యాక్స్ విజన్ శ్రీ మహాలక్ష్మీ కంటి ఆసుపత్రి వారు నిర్వహించనున్నట్లు తెలిపారు. విశ్రాంత ఉద్యోగులకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

నాంపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నాంపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు గురువారం శంకుస్థాపన చేశారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం డీఎంఎఫ్‌టీ నిధులు రూ.10 లక్షలు కలెక్టర్ ఇలా త్రిపాఠి మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ముగ్గుపోసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కత్తి రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పూల వెంకటయ్య, నాయకులు సంగెం గణేష్, రాజశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గుండాల అంజయ్య, అన్నెపాక కిరణ్, హరీష్, పీఆర్‌ఏఈ హరీష్ పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

కట్టంగూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేటలో ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే కల్లు గీత కార్మిక సంఘం 4వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కట్టంగూరు మండలంలోని నారెగూడెంలో గురువారం రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ మహాసభల్లో గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, డిమాండ్ల సాధన కోసం కార్యాచరణ రూపొందించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ మహాసభలకు గీత కార్మికులు అధిక సంఖ్యలో హాజరై ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సభ్యుడు ఆకుల శంకరయ్య, నాగరాజు, అంతటి శ్రీను, ఎల్లయ్య, సతీష్ పాల్గొన్నారు.

నేడు జమాతే ఇస్లామీ హింద్ క్యాడర్ మీట్

నల్లగొండటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ముస్లిం సమాజం మధ్య మానవీయ విలువల స్థాపన, నైతిక ప్రగతిని లక్ష్యంగా చేసుకుని పనిచేస్తున్న జమాతే ఇస్లామీహింద్ (ఒఐఏ) జిల్లా స్థాయి క్యాడర్ మీట్‌ను ఈ నెల 15న నిర్వహించడానికి సన్నాహాలు పూర్తి చేసింది. నల్లగొండలోని మాన్యంచెల్కలోని రేడియన్స్ స్కూల్ మైదానంలో నిర్వహించే ఈ సమావేశానికి ఉమ్మడి నల్లగొండ జిల్లా నలుమూలల నుంచి సంస్థ క్రియాశీల కార్యకర్తలు, సభ్యులు, భావజాల సానుభూతిపరులు హాజరుకానున్నారు. ఈ కీలక సమావేశానికి జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు ముహమ్మద్ అజహరుద్దీన్ అధ్యక్షత వహించనున్నారు. సామాజిక న్యాయం, విద్య, సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి చేరువవుతున్న జమాతే ఇస్లామీహింద్, ఈ క్యాడర్ మీట్ ద్వారా తన పునాదులను మరింత బలోపేతం చేసుకుని, జిల్లాలో తమ మానవీయ, నైతిక ఉద్యమానికి మరింత పదును పెట్టడానికి సిద్ధమవుతోందని జమాతే ఇస్లామీహింద్ జిల్లా అధ్యక్షుడు ప్రొఫెసర్ అబ్దుల్ మజీద్ పేర్కొన్నారు.

17న ఇందిరా పార్కు వద్ద ధర్నా

నల్లగొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ పెన్షనర్స్ ఐక కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని పెన్షనర్స్ అసోసియేషన్ నల్లగొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాడి భాస్కర్‌రెడ్డి, సీహెచ్ సుధాకర్‌రెడ్డి కోరారు. పట్టణంలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు 20 నెలలుగా పీఆర్‌సీ, ఏరియర్స్, జీపీఎఫ్, గ్రాట్యూట్, జీఎస్, టీపీజీఎల్‌ఐసీ వంటి బిల్లులు రాకపోవడం వల్ల ఆర్థికంగా, మానసికంగా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే 40 మంది ఆర్థిక ఇబ్బందులతో చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే బకాయిలు చెల్లించాలని లేనిచో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. 17వ తేదీన నిర్వహించే ధర్నాకు పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు పాల్గొన్నాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు ఆర్.దుర్గయ్య, బాలయ్య, మారయ్య, వెంకట్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కృష్ణయ్య, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

19న చంద్రపుల్లారెడ్డి పుస్తకావిష్కరణ సభ

కట్టంగూరు, నవంబరు 13, (ఆంధ్రజ్యోతి): భారత విప్లవోద్యమ నిర్మాత కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి రాసిన గేయాల పుస్తకాన్ని ఆయన 41వ వర్థంతి సందర్భంగా ఈనెల 19న హైద్రాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరిస్తున్నట్లు సీపీఐఎంఎల్ న్యూ డెమొక్రసీ నకిరేకల్ డివిజన్ నాయకుడు రైతు కూలీ సంఘం జిల్లా కోశాధికారి గజ్జి రవి అన్నారు. గురువారం కట్టంగూరు మండలంలోని ఈదులూర్‌లో కామ్రేడ్ బూరుగు అంజన్న విజ్ఞాన కేంద్రం వద్ద పుస్తకావిష్కరణ సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ పుస్తకావిష్కరణసభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ నాయకులు బూరుగు సత్యనారాయణ, గంగనబోయిన వీరాంజనేయులు, గోదల పురుషోత్తంరెడ్డి, యాదగిరిరెడ్డి, గజ్జి మల్లయ్య, పెద్దపాటి అంజయ్య, గద్దపాటి అంజయ్య, నాగులపాటి బిక్షం, దండంపల్లి లింగయ్య, అంజయ్య, యాదగిరి పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరణ చేస్తున్న నాయకులు

సీసీఐలో పత్తి విక్రయించేందుకు కౌలు రైతులకు ఓకే


(5వ పేజీ తరువాయి)

కౌలు రైతు పత్తి విక్రయించేలా వివరాలు నమోదు చేశామని, ఈ నేపథ్యంలో భూ యజమాని నిరభ్యంతరంగా ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెబితే ఎలాంటి ఇబ్బందులు ఉండవని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

తాజాగా అవకాశం

కొద్ది రోజులుగా ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేకపోవడంతో అధికార యంత్రాంగం వెబ్‌సైట్‌ను ఓపెన్ చేయకపోవడంతో పాటు ఏఈవోలు యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లను ఉపయోగించడంలేదు. దీంతో కౌలు రైతులు ఇబ్బందులు లేకుండా పత్తి విక్రయించే అవకాశం లేకుండా పోయింది. తాజాగా, ప్రభుత్వ ఆదేశాలతో వ్యవసాయశాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో కౌలు రైతులు సీసీఐలో పత్తి విక్రయించే అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇదిలా ఉంటే జిల్లా వ్యాప్తంగా 55,221 క్వింటాళ్ల పత్తిని సీసీఐ ఇప్పటి వరకు కొనుగోలు చేసింది. జిల్లాలో ఉన్న 23 జిన్నింగ్ మిల్లులకు 18 జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్ల ప్రారంభమయ్యాయి.

ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 29.5
కనిష్ఠం 19.0
***
ANDHRAJYOTHY



నల్లగొండ
5
శుక్రవారం 14 నవంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.30 (305.6838)	15,060	15,060
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.15 (4.24)	1,642.81	2,493.07
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.226 (43.0610)	10,544	8,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250



బెస్ట్ అవైలబుల్ స్కీం నిధులు విడుదల చేయాలని కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు (ఫైల్)

ఆర్థికంగా వెనకబడిన ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన పిల్లలకు నాణ్యమైన ప్రైవేట్ విద్య అందించే లక్ష్యంతో ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కీం (బీఏఎస్)ను ప్రవేశపెట్టింది. ఏటా 1 నుంచి 5వ తరగతుల్లో అడ్మిషన్లు కల్పిస్తూ 10వ తరగతి వరకు విద్యార్థులకు ఉచితంగా ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వం విద్య అందిస్తోంది. అందుకు ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వం ఫీజులు చెల్లిస్తుంది. అయితే మూడేళ్లుగా దీనికి సంబంధించిన నిధులు పెండింగ్‌లో ఉంచడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- (ఆంధ్రజ్యోతి, నల్లగొండ టౌన్)

ఇలా అయితే చదువు సాగేదెలా?

» జిల్లాలో నీరుగారుతున్న బీఏఎస్ పథకం
» ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నామమాత్రంగానే ప్రైవేట్ విద్య
» తల్లిదండ్రుల నుంచే పుస్తకాలకు, హాస్టల్‌కు డబ్బు వసూలు
» మూడేళ్లుగా నిధులు ఇవ్వని ప్రభుత్వం



బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ప్రభుత్వం నిరుపేద విద్యార్థులకు ప్రైవేట్‌పాఠశాలల్లో రెసిడెన్షియల్, డేస్కాలర్స్ విధానంలో చదువుకునే అవకాశం కల్పిస్తోంది. అందుకు ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖల ద్వారా పాఠశాలను ఎంపిక చేసి ఏటా నోటిఫికేషన్ విడుదల చేసి 1, 3, 5 తరగతుల్లో ప్రవేశాలకు లాటరీ విధానంలో విద్యార్థులను ఎంపిక చేస్తోంది. ఎంపికైన విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో చదివేందుకు ప్రభుత్వమే పాఠశాల ఫీజులు, హాస్టల్ ఫీజులు విడుదల చేస్తుంది. అయితే గడిచిన మూడేళ్లుగా జిల్లాలో బీఏఎస్ పాఠశాలలకు నిధులు విడుదల కాకపోవడంలేదు. జిల్లావ్యాప్తంగా రూ.8.5కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో ఇటీవల ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిరసన నిర్వహించాయి. దీంతో దసరా పండుగ అనంతరం బకాయిల్లో 25శాతం నిధులను మాత్రమే ప్రభుత్వం విడుదల చేసింది.

8 21 పాఠశాలల ఎంపిక

జిల్లాలో బెస్ట్ అవైలబుల్ పథకానికి సాంఘికసంక్షేమశాఖ పరిధిలో 13 పాఠశాలలను, గిరిజన సంక్షేమశాఖ పరిధిలో 8 పాఠశాలలను ఎంపిక చేశారు. మొత్తం 21 పాఠశాలల్లో 3,000 మంది ఈ స్కీం కిం ద విద్యనభ్యసిస్తున్నారు. ఆయా పాఠశాలల్లో 5 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.42వేలు, నాన్ రెసిడెన్షియల్ విద్యార్థులకు రూ.28వేల చొప్పున ప్రభుత్వం ఏటా ఖర్చు చేస్తోంది. 1 నుంచి 5వ తరగతుల వరకు చదివే డేస్కాలర్‌కు పుస్తకాలు, షూ, నోటుబుక్స్ ఇస్తోంది. 5 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న వారికి హాస్టల్ వసతి కల్పిస్తోంది. అయితే వీటికి సంబంధించిన నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల ప్రభుత్వం 25శాతం బకాయి నిధులు విడుదల చేయగా, ఇంకా రూ.6కోట్ల మేర బిల్లులు చెల్లించాల్సి ఉంది.

అవగాహన లేకపోవడంతో

బీఏఎస్ ద్వారా ఎంపికైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పథకంపై పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడంతో యాజమాన్యాలు ఎలా చెబితే అలా ఫీజు చెల్లిస్తున్నారు. నోటుబుక్స్, పాఠ్యపుస్తకాలు, హాస్టల్, షూ, అడ్మిషన్ ఫీజు ఇలా ప్రైవేట్ పాఠశాలలు అన్నీ ఉచితంగా అందించాల్సి ఉంది. కానీ, ప్రభుత్వం నిధులు విడుదల చేయడంలేదనే సాకు చూపి ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే చాలా పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫీజులు వసూలు చేసినట్టు సమాచారం. కొన్ని పాఠశాలల్లో కేవలం తరగతులు నిర్వహించేందుకు మాత్రమే అనుమతులు ఉండగా, అందుకు విరుద్ధంగా హాస్టల్స్ కొనసాగిస్తూ, విద్యార్థులకు వసతి కల్పించి తల్లిదండ్రుల నుంచి హాస్టల్ ఫీజులు వసూలు చేస్తున్నట్టు తెలిసింది. చాలా పాఠశాలల్లో విద్యార్థులకు మూడు పూటలా పెట్టాల్సిన..

- మిగతా 8వ పేజీలో...

సీసీఐలో పత్తి విక్రయించేందుకు

కౌలు రైతులకు ఓకే

» 'కపాస్ కిసాన్ యాప్'లో అందుబాటులో ఆప్షన్ » పట్టాదారు ఓటీపీ చెబితేనే విక్రయించేలా తిరకాసు



ప్రభుత్వరంగం సంస్థ అయిన సీసీఐలో పత్తి విక్రయించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కౌలు రైతులకు అనుమతి ఇచ్చాయి. గతంలో కౌలు రైతును గుర్తించడం, లేదా నేరుగా వారి బ్యాంక్ ఖాతాలో డబ్బు జమ చేయడం చేసేవారు. అయితే కొన్నేళ్లుగా ధాన్యంతో పాటు పత్తి, ఇతర పంటలను ప్రభుత్వరంగ సంస్థల్లో విక్రయిస్తే కౌలు రైతులకు బదులు ఆ సొమ్మును పట్టాదారుకు చెందిన బ్యాంక్ ఖాతాలో జమచేస్తున్నారు. ప్రస్తుతం కూడా అదే పరిస్థితి ఉన్నా, పట్టాదారు సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీ చెబితే కౌలు రైతుల ఖాతాలో నగదు జమ చేసేలా ఈసారి ఆప్షన్ కల్పించారు. ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన 'కపాస్ కిసాన్ యాప్'లో ఈ ఆప్షన్‌ను పొందుపర్చారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

జిల్లాలో గత నెల 24వ తేదీ నుంచి సీసీఐ పత్తి కొనుగోలు చేస్తున్నా, కౌలు రైతులకు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి ఆప్షన్ లేదు. దీంతో కౌలు రైతుల ఆందోళనను దృష్టిలో ఉంచుకొని జిల్లా వ్యవసాయశాఖ అధికారులు వెబ్‌సైట్‌ను ఆప్షన్‌ను కల్పించారు. 'కపాస్ కిసాన్ యాప్'లో కౌలు రైతులు కౌలు చేస్తున్న భూముల సర్వే నెంబర్‌ను, భూమి వివరాలను నమోదు చేశాక సంబంధిత శాఖ అధికారులు పట్టాదారుకు ఫోన్ చేసి ఓటీపీ అడుగుతారు. సదరు పట్టాదారు ఓటీపీ చెబితేనే కౌలురైతు పత్తిని విక్రయించే అవకాశం ఉంది. అయితే చాలా మంది పట్టాదారులు కౌలుదారుకు కౌలు ఇస్తున్నట్లు ఎక్కడా అగ్రిమెంట్ చేసుకున్న దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో ఓటీపీ చెబితే రానున్న రోజుల్లో ఏమైనా ఇబ్బందులు తలెత్తుతాయా అని పట్టాదారులు కొంత అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని అధికార యంత్రాంగం ఈ ఒక్క సీజన్‌లో కొనుగోళ్లకు మాత్రమే సంబంధిత 'కపాస్ కిసాన్ యాప్' ద్వారా.....

- మిగతా 8వ పేజీలో...

సహజ వ్యవసాయాన్ని

ప్రోత్సహించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



మునుగోడు మండలం కిష్టాపురం గ్రామంలో సేంద్రియ ఎరువుల ద్వారా సాగు చేస్తున్న వరి పైరును పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి


మునుగోడురూరల్, నవంబరు 13,(ఆంధ్రజ్యోతి):సహజ సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మండలంలోని కిష్టాపురం గ్రామంలో రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుండా యువ రైతు జక్కుల వెంకటేశ్ పండిస్తున్న సహజ పంటలను గురువారం ఆమె పరిశీలించారు. సహజ పంటలను ఏ విధంగా పండిస్తున్నారని రైతును అడిగి తెలుసుకున్నారు. ఈ పంటలతో లాభాలు, పంటలు ఏ విధంగా ఉన్నాయి, ఈ పంటలు కావల్సిన సహజ ఎరువులు వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జీవామృతం, జీవగణామృతం వాడతామని వెంకటేష్ తెలిపారు. సహజ వ్యవసాయంద్వారా రైతులఉత్పత్తి వ్యయాలుతగ్గి, నాణ్యమైన పంటలు, పర్యావరణానికి హాని లేకుండా ఆరోగ్యకరమైన ఆహారం లభిస్తుందన్నారు. జిల్లాలో సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, రైతులు ఈ పద్ధతిని అవలంబిస్తే భూసారాన్ని కాపాడుతూ ఆరోగ్యకరమైన పంటలను ఉత్పత్తి చేయగలుగుతారన్నారు. సహజ పద్ధతిలో సాగు చేయాలనుకున్న రైతులకు సాంకేతిక సాయం అందించాలని అధికారులకు సూచించారు. ఈ నెల 22న నల్లగొండ కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఉదయాదిత్య భవన్‌లో సహజ వ్యవసాయంపై విజయరామ సహజ వ్యవసాయ నిపుణుల అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, డీఆర్‌డీపీడీ శేఖర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్, ఆర్డీవో శ్రీదేవి, అనంతరెడ్డి ఏడీ వేణుగోపాల్, తహసీల్దార్ నరేష్ పాల్గొన్నారు.

పోడు భూముల సమస్య యథాతథం

» ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని వైనం » చందంపేట అటవీ ప్రాంతంలో నిత్యం ఘర్షణ వాతావరణం » తాజాగా, అటవీ అధికారులపై దాడి చేసిన ఐదుగురిపై కేసు

నల్లమల అటవీ ప్రాంతమైన చందంపేట, పీఏపల్లి మండలాల్లో రైతులు, అటవీశాఖ అధికారుల మధ్య నిత్యం ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంటోంది. ప్రభుత్వాలు కొన్నేళ్ల క్రితమే అటవీ హక్కుల పత్రాలు అందజేసిందని, సేద్యంలో ఉన్నా అటవీశాఖ అధికారులు తరచూ దాడులు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, కొంత కాలంగా యంత్రాలతో అటవిని ధ్వంసం చేసి కొంతమంది భూములను ఆక్రమించుకుంటున్నారని, తనిఖీలు, విచారణకు వెళ్తే దాడులకు పాల్పడుతున్నారని అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఇలా నిత్యం ఉద్రిక్తత వాతావరణం ఉంటోంది.

- (ఆంధ్రజ్యోతి,దేవరకొండ)



చందంపేట మండలం నల్లమల అటవీ ప్రాంతం

నల్లమల పరిధిలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ కింద చందంపేట, పీఏపల్లి మండలాల్లో 26,795 హెక్టార్లలో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. సాగర్ రేంజ్ పరిధిలో కంబాలపల్లి, దేవరకొండ రేంజ్‌లు ఉన్నాయి. అటవీ జంతువుల సంరక్షణ, అడవి అభివృద్ధికి గత ఏడాది కేంద్ర ప్రభుత్వం రూ.450కోట్లు కేటాయించింది. దీంతో బేస్ క్యాంపులు, నీటితొట్లు, చెక్‌డ్యాంలు, కంచె, సీసీ కెమెరాలతోపాటు పలు అభివృద్ధి పనులు చేపట్టారు.

14,942 ఎకరాల భూమి 7,176 మందికి కేటాయింపు

నాగార్జునసాగర్ ముంపు బాధితులకు నల్లమల ప్రాంతమైన చందంపేట, పీఏపల్లి మండలాల్లో అటవీ భూములకు ప్రభుత్వాలు 7,176 మందికి 14,942 ఎకరాలకు పట్టాలు ఇచ్చిందని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. కాగా, మరికొంత మంది రైతులు కొన్నేళ్లుగా అటవీ భూములను సేద్యం చేస్తూ హక్కు పత్రాల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే సేద్యం చేసుకుంటున్న భూమిని అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకుంటున్నారని వారు వాపోతున్నారు. తాజాగా ఈనెల 12న చందంపేట మండలం గువ్వలగుట్ట అటవీ ప్రాంతంలో నాగార్జునసాగర్ ఎఫ్ఆర్‌వో సంగీత ఆధ్వర్యంలో అధికారుల బృందం తనిఖీలు నిర్వహించింది. గువ్వలగుట్ట సమీపంలో మూడావత్ లాలునాయక్ అనే రైతు యంత్రాలతో భూమిని చదును చేస్తున్నాడని తెలుసుకున్న అటవీశాఖ అధికారులు అక్కడికి చేరుకొని విచారణ నిర్వహించారు. దీంతో సదరు రైతు తనకు హక్కు పత్రాలు ఉన్నాయని, ఇంటి వద్ద ఉన్నాయని చెప్పాడు. అటవీ అధికారులు సమీపంలోనే ఉన్న గువ్వలగుట్ట గ్రామానికి వాహనంలో రైతు లాలును తీసుకెళ్లగా, గ్రామ శివారు వద్దకు చేరగానే గ్రామానికి చెందిన కొంతమంది యువకులు ముకుమ్మడిగా అటవీశాఖ అధికారులపై దాడులు చేశారు. ఈ దాడుల్లో సెల్‌ఫోన్‌లు ధ్వంసమయ్యాయి. అటవీశాఖ వాహన డ్రైవర్ మహమ్మద్ ఖాజా, సిబ్బంది, బీట్ అధికారులు మోహిత్‌కృష్ణ, విష్ణు, సుమన్, కిరణ్‌కుమార్, శ్రీనివాస్‌కుమార్, చంద్రయ్యకు గాయాలయ్యాయి. దీంతో అటవీ అధికారులు దేవరకొండకు చేరుకొని గాయపడిన వారిని ఆస్పత్రిలో చేర్పించారు.

ఖాజా, శ్రీనివాస్‌కుమార్‌కు తీవ్ర గాయాలవడంతో మెరుగైన వైద్యం కోసం నల్లగొండకు తరలించినట్లు కంభాలపల్లి రేంజ్ అటవీశాఖ అధికారి భాస్కర్ తెలిపారు. దాడికి పాల్పడిన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు ఐదుగురిపై కేసు నమోదు చేశారు. కాగా, ఇలాంటి ఘటనలతో తరచూ నల్లమలలో ఉద్రిక్త వాతావరణం నెలకొంటోంది. సేద్యంలో ఉన్న రైతులకు పట్టాలు ఇచ్చి హక్కులు కల్పించాలని రైతు సంఘాల నేతలు కోరుతున్నారు.

కాలానికి అనుగుణంగా అనుమతులు ఇవ్వాలి



ప్రభుత్వం ఇచ్చిన అటవీ భూముల సేద్యానికి యంత్రాలతో పనులు చేసేందుకు అనుమతిలేదు. పాత పద్ధతిలోనే ఎద్దులు, నాగళ్లతో దున్నుకోవాలి. రెండు మూడేళ్ల సేద్యం చేయకుంటే ఆ భూములను అటవీశాఖ అధికారులు ఆక్రమించుకుంటున్నారు. సేద్యంలో ఉన్న రైతులందరికీ హక్కు పత్రాలు ఇవ్వడంతోపాటు యంత్రాలతో వ్యవసాయం చేసుకునేలా అనుమతులు ఇవ్వాలి.

- కంభాలపల్లి ఆనంద్, రైతు సంఘం నేత, దేవరకొండ

హక్కుపత్రాలు ఇవ్వకపోవడం వల్లే సమస్యలు

గత 40 ఏళ్లుగా భూములు సాగు చేసుకుంటున్నాం. నాగార్జునసాగర్ ముంపు బాధితులకు అప్పట్లో ప్రభుత్వం డీ-ఫారెస్ట్ పట్టాలు ఇచ్చింది. కొందరికి హక్కుపత్రాలు ఇవ్వకపోవడంతో సేద్యంలో ఉన్నా అటవీ అధికారులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. దీంతో గొడవలు జరుగుతున్నాయి. ప్రభుత్వాలు పట్టాలు ఇచ్చి హద్దులు నిర్ణయిస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

- బాలాజీనాయక్, రైతు, గువ్వలగుట్టతండా

దాడులు చేస్తే చర్యలు

అటవీశాఖ ఉద్యోగులు అటవీ సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నారు. గువ్వలగుట్టలో గ్రామస్థులు అటవీశాఖ అధికారులపై దాడులు చేయడం సరైన పద్ధతికాదు. ప్రభుత్వం ఇచ్చిన హక్కుపత్రాలు చూపిస్తే సరిపోతుంది. అటవీ సంరక్షణకే ఉద్యోగులు పనిచేస్తున్నారు. మున్ముందు ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటాం.

- రాజశేఖర్, జిల్లా అటవీశాఖ అధికారి

బీసీ రిజర్వేషన్ల తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ చక్రహరి రామరాజు



జిల్లా కేంద్రంలో బీసీ ధర్మపోరాట దీక్షలో మాట్లాడుతున్న చక్రహరి రామరాజు

నల్లగొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ చక్రహరి రామరాజు డిమాండ్ చేశారు. గురువారం జిల్లాకేంద్రంలోని ఎన్జీ కళాశాల ఎదుట బీసీ ధర్మపోరాట దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చొరవ తీసుకుని రాజ్యాంగ బద్ధమైన రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నారు. రాష్ట్రంలోని బీజేపీ ఎంపీలు బాధ్యత తీసుకొని 42శాతం రిజర్వేషన్లు అమలు జరిగే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి చట్టబద్ధత కల్పించాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలనే నేపథ్యంలోనే రాష్ట్ర బీసీ జేఏసీ పిలుపు మేరకు దీక్ష చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు తండు సైదులు గౌడ్, సుంకరి మల్లేష్‌గౌడ్, పిల్లి రామరాజుయాదవ్, నేలపట్ల సత్యనారాయణ, కాసోజు విశ్వనాథం, నకిరేకంటి కాశీనాథం, చిక్కుల రాములు, ఇంద్రయ్య, సీతారాములు, వెంకటేశ్వర్లు, సోమ మల్లయ్య, బొమ్మరబోయిన కేశవులు, సాయిబాబా, రమేష్, శ్యాంసుందర్, బిక్షం, ఆదినారాయణ, ఎల్లం రాజు, మధు, రాములు, మల్లయ్య, కంది సూర్యనారాయణ పాల్గొన్నారు.

త్వరగా ధాన్యం కొనుగోలు చేయాలి

డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి

మర్రిగూడ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రైతులు కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని త్వరగా కొనుగోలు ప్రారంభించాలని డీఆర్‌డీఏపీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు విక్రయాలకు తీసుకొచ్చిన ధాన్యం ఆరబెట్టి తాలు లేకుండా తూర్పాల పట్టి తేమశాతం (మ్యాచర్) వచ్చే విధంగా ఉంటే ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర పొందాలని సూచించారు. హమాలీలకు రైతులే రూ.45వేల చొప్పున కూలి చెల్లించాలన్నారు. అదేవిధంగా రైతులు సీసీఐ కేంద్రానికి తీసుకొచ్చిన ధాన్యాన్ని రైతుల పేర్లును రికార్డులో తప్పనిసరిగా నమోదు చేయాలని, రైతులకు ఏ విధమైనటు వంటి ఇబ్బందులకు గురి చేయవద్దని అధికారులకు సూచించారు. రైతులు తెచ్చినటు వంటి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని ఏ ఒక్కరూ అధైర్యపడవద్దని రైతులు నిబంధనలు పాటించాలని సూచించారు. ఈయన వెంట మర్రిగూడ ఐకేపీ సిబ్బంది అధికారులు ఉన్నారు.



మర్రిగూడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీచేస్తున్న పీడీ శేఖర్‌రెడ్డి

వేగం కన్నా ప్రాణం మిన్న

» ప్రమాదాల నివారణకు పోలీసుల వినూత్న ఆలోచన
» వాహనదారులకు అవగాహన కల్పిస్తూ హోర్డింగ్ 7
» ప్రమాదానికి గురైన కారు వెలిమినేడు శివారులో ఏర్పాటు

ప్రజారోగ్య పరిరక్షణకు కృషి



మొబైల్ ఎక్స్‌రే స్క్రీనింగ్ తీరును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

డీఎంహెచ్‌వో శ్రీనివాస్

మునుగోడు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేక శ్రద్ధతో కృషి చేస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్ తెలిపారు. గురువారం మునుగోడు పీహెచ్‌సీలో నిర్వహించిన ఏఐ పవర్డ్ మొబైల్ ఎక్స్‌రే స్క్రీనింగ్ క్యాంపును డీటీసీవో డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తితో కలిసి ఆయన సందర్శించారు. పరీక్ష తీరును పరిశీలించారు. వైద్య పరీక్షలకు వచ్చిన రోగులతో మాట్లాడిన అనంతరం ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రజలు తమ ఆరోగ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ఇబ్బందులు నెలకొనే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఆరోగ్యం కోసం వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ నర్మద, జిల్లా వైద్య ఆరోగ్య ఆర్గనైజర్ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మునిసిపాలిటీకి మహర్దశ

మిర్యాలగూడ మునిసిపాలిటీకి మహర్దశ పట్టనుంది. అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్టర్ డెవలప్‌మెంట్ ఫండ్ (యూఐడీఎఫ్) నిధులు రూ. 16.70 కోట్లు మంజూరు కావడంతో అభివృద్ధి పనులు పరుగెట్టనున్నాయి. మౌలిక సదుపాయాల రూపకల్పనతో పాటు యూఐడీఎఫ్ నిధులతో రహదారులు, పార్కులు, శ్మశానవాటికల అభివృద్ధిపనులను చేపట్టేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గతంలో ప్రతిపాదనలు పంపగా, అంచనా వ్యయాలను పరిగణనలోకి తీసుకుని అందుకు అనుగుణంగా యూఈడీఎఫ్ నిధులు మంజూరైనట్లు అధికారులు తెలిపారు.

- (ఆంధ్రజ్యోతి - మిర్యాలగూడ టౌన్)


మిర్యాలగూడ పట్టణం

» రూ.16.70 కోట్లతో అభివృద్ధి పనులు
» విడుదలైన యూఐడీఎఫ్ నిధులు

మునిసిపాలిటీ పరిధిలోని అసంపూర్తి రోడ్లు, శివారు కాలనీల్లో సీసీ రోడ్ల ఏర్పాటుకు రూ.6కోట్లు కేటాయించనున్నారు. ఇక సీసీ డ్రైయిన్లకు రూ. 6కోట్లు, అర్బన్ పార్కుల అభివృద్ధికి రూ. 2కోట్లు, నీటి శుద్ధి సరఫరా కోసం రూ. 1.70 కోట్లు కేటాయించనున్నారు. ఈదులగూడ శ్మశానవాటిక అభివృద్ధికి కోటి రూపాయలు కేటాయించనున్నారు. పట్టణ ప్రజలకు అందించే తాగునీటి మంచినీటి సరఫరా వ్యవస్థను ఆధునీకరించడంతో పాటు డ్రింక్ డైరెక్ట్ ఫ్రమ్ టాప్ (డీడీఎఫ్‌టీ) విధానాన్ని అమలు చేయనున్నారు. చేపట్టనున్న పనుల్లో రెండింటిని అధికారులు పైలట్ ప్రాజెక్టులుగా ఎంపిక చేశారు.

ఆర్థిక సంవత్సరాంతానికి ఖర్చు చేయాల్సిందే

అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్టర్ డెవలప్‌మెంట్ ఫండ్ (యూఐడీఎఫ్) కింద మంజూరైన నిధులు రూ. 16.70 కోట్లను ఈ ఆర్థిక సంవత్సరంలో (అంటే 2026 మార్చి 31వ తేదీ నాటికి) ఖర్చు చేయాల్సి ఉంది. ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ సూచనల మేరకు చేపట్టాల్సిన పనులను అంచనా వేసి టెండర్లు పిలవనున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లను మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగం శరవేగంగా చేస్తోంది.

ఇక్కట్లు తీరేనా..?

పట్టణం శరవేగంగా విస్తరిస్తుండగా కొత్తకొత్త కాలనీలు పుట్టకొస్తున్నాయి. అయితే ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు కాకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా అంతర్గత రహదారులు గుంతలమయంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక మురుగు, వర్షపు నీరు సవ్యంగా పారేందుకు డ్రెయిన్లు లేకపోవడంతో పట్టణంలోని పలు కాలనీలు జలయమమవుతున్నాయి. శ్మశానవాటికలు అభివృద్ధికి నోచుకోక పోగా, వాటికోసం కేటాయించిన స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఈ తరుణంలో ఆయా పనుల నిర్వహణకు నిధుల మంజూరు కావడంతో పట్టణ ప్రజల బాధలు కొంతమేర తీరనున్నాయి.

అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం.



అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్టర్ డెవలప్‌మెంట్ ఫండ్ (యూఐడీఎఫ్)తో పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టనున్నాం. ప్రజల అవసరాలకు అనుగుణంగా, ఉన్నతాధికారుల సూచనల మేరకు నిర్దేశిత పనులు ప్రారంభిస్తాం. రహదారులు, డ్రైన్లు, పార్కుల అభివృద్ధితో పాటు శ్మశానవాటికను అభివృద్ధి చేయనున్నాం. ఎమ్మెల్యే సహకారంతో పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

- గణవేణి శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ

ప్రత్యేక పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు..!

నిర్దేశిత పనులను యూఈడీఎఫ్ నిధులు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేసింది. టెండర్ల నిర్వహణ మొదలుకుని, పనులు పూర్తయ్యే వరకూ ఉన్నత స్థాయి అధికారుల పర్యవేక్షణ కొనసాగనుంది. పాలకవర్గాల పదవీకాలం ముగిసి పది నెలలు కావస్తుండగా, ప్రత్యేకాధికారుల పాలనలో ఉన్న పురపాలికలలో అభివృద్ధి పనులు నిర్వహించేందుకు ప్రత్యేక పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేయడం గమనార్హం.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

సారా విక్రయిస్తే కఠిన చర్యలు

శ్రీనివాస్, ఎక్సైజ్ సీఐ, దేవరకొండ



దేవరకొండ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో సారా విక్రయాలు జరిపితే దాడులు చేసి చర్యలు తీసుకుంటాం. బైండోవర్‌లు చేసి జరిమానాలు విధిస్తామని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ అన్నారు. నల్లబెల్లం రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. నల్లబెల్లం, పట్టిక, సారా అక్రమ రవాణాకు సంబంధించి 52 వాహనాలను సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

(దేవరకొండ, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: సారా తయారీ అరికట్టడానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

సీఐ: దేవరకొండ ఎక్సైజ్ పోలీసులు, జిల్లా టాస్క్‌ఫోర్స్ సారా, బెల్లం రవాణాపై తనిఖీలు చేయడంతో పాటు దాడులు చేస్తున్నాం. ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో 52కు పైగా వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేశాం.

ఆంధ్రజ్యోతి: ఇప్పటివరకు ఎంత మందిని బైండోవర్ చేశారు? ఎన్ని కేసులు నమోదు చేశారు?

సీఐ: ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఈ ఏడాది 200 కేసులు నమోదు చేసి 202 మందిని అరెస్ట్ చేశాం. 7135 కిలోల నల్లబెల్లం పౌడర్, 375 కిలోల పట్టిక, 52 వాహనాలను సీజ్ చేశాం. 17 మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి జరిమానాలు విధించాం.

ఆంధ్రజ్యోతి: సర్కిల్ పరిధిలో నూతనంగా ఎన్ని వైన్స్ దుకాణాలు మంజూరయ్యాయి?

సీఐ: దేవరకొండ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఇటీవల నిర్వహించిన వేలం పాటలో 22మద్యం దుకాణాలు మంజూరయ్యాయి. దేవరకొండలో 7, కొండమల్లేపల్లి 6, నేరేడుగొమ్ము 1, చందంపేట 2, డిండి 2, పీఏపల్లి 3, గుడిపల్లిలో 1, అంతేకాక రెండు బార్లు నడుస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి: తాటి, ఈత మొక్కలను పంపిణీ చేస్తున్నారా?

సీఐ: సర్కిల్ పరిధిలో గ్రామాలలోని నర్సరీల్లో ఈత వనాలు పెంచి గీత సంఘాలకు మొక్కలు పంపిణీ చేస్తున్నాం. గతంలో తాటికోలులో ఈత వనానికి ఐదు ఎకరాలు కేటాయించాం. ఈత వనాలు పెంచేందుకు ప్రోత్సహిస్తున్నాం.

పోషకాహారాన్ని తీసుకోవాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి హరిప్రియ

చింతపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులందరూ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవాలని వీటీ నగర్ వైద్యాధికారి హరిప్రియ అన్నారు. మండలంలోని వేంకటేశ్వరనగర్ జడ్పీహెచ్ఎస్‌లో గురువారం విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కాప్సికం, బొప్పాయి, ఆకుకూరలు అధిక శాతం తినవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో పాటు జ్ఞాపకశక్తి మెరుగు పడుతుందన్నారు. ప్రణాళిక తయారు చేసుకొని చదవడంతో ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణవేణి, ఉపాధ్యాయులు మహమ్మద్ అన్వర్, వోలీ సుదీర్‌కుమార్, నరసింహ, మోతీలాల్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

దేవాలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలు


ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డిని సన్మానిస్తున్న ఎల్లాపురం గ్రామస్థులు

తిరుమలగిరి(సాగర్), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): దేవాలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలని ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఎల్లాపురం గ్రామంలో నిర్మించిన అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ, నూతన ధ్వజస్తంభ ఏర్పాటు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్థులు, ఆలయ కమిటీ నిర్వాహకులు ఆయన్ను శాలువాలతో సన్మానించారు. గురుస్వామి ప్రసాద్ ఆధ్వర్యంలో వేదమంత్రాలు, కోలాట నృత్యాలతో స్వామియే శరణమయ్యప్ప అనే శరణుఘోష నడుమ అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠను కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి సహకారంతో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన అయ్యప్ప, హనుమాన్, శివ మాలలు ధరించిన స్వాములు విచ్చేసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు మండల గోవింద్‌యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి, గజ్జల శ్రీనివాస్‌రెడ్డి, గుండెబోయిన అంజియాదవ్, ఆలయ ధర్మకర్త ఆవుల సాయిలు, విగ్రహదాత మోహన్ గురుస్వామి, కాంసాని పురుషోత్తంయాదవ్, బాషం వెంకటేశ్వర్లు, రావులపాటి గురవయ్య, గంగరాజుయాదవ్, శ్రీనివాస్, అశోక్, రాజు, ఏసు, ప్రభాకర్, యాదగిరి, మధు, సైదులు పాల్గొన్నారు.

'పీఎం దర్తీ ఆభ'తో మౌలిక వసతులు


నీమానాయక్‌తండాలో మాట్లాడుతున్న ట్రైనర్ కొల్లు బాలకృష్ణ

పెద్దవూర, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం దర్తీ ఆభ - ఆది కర్మయోగి అభియాన్ పథకంతో భాగంగా గిరిజన తండాల్లో మౌలిక సదుపాయాల కల్పిస్తున్నట్లు మండల బ్లాక్‌మాస్టర్ ట్రైనర్ కొల్లు బాలకృష్ణ అన్నారు. మండలంలోని నీమానాయక్‌తండా, పాల్తీతండా, పర్వేదుల, జయరాంతండా, నాయనవానికుంటతండా, చలకుర్తి, పొట్టివానితండా, చింతపల్లి తదితర గ్రామాల్లో గురువారం నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. గిరిజనతండాల్లో మౌలిక వసతులు కల్పించడమే ఆది కర్మయోగి అభియాన్ పథకం లక్ష్యమని అన్నారు. కేంద్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో తరి రాము, నగేష్, దీక్షిత్, వెంకాయమ్మ, శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలి

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లో దామరచర్ల బీసీ గురుకుల బాలికల పాఠశాలలో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడలు ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థినులతో కలిసి అల్పాహారం చేసి పాఠశాల వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి దేశం గర్వించే విధంగా ఎదగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తుందని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని క్రీడల్లో ప్రతిభ చూపి పాఠశాలకు, తల్లిండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ గురుకల ఆర్‌సీవో స్వప్న, డీసీవో సంధ్య, ఎంఈవో బాలునాయక్, ప్రిన్సిపాల్స్ నవీన్‌కుమార్, ఉమాదేవి, లలిత తదితరులు పాల్గొన్నారు.

క్రీడల ప్రోత్సాహకానికి ప్రత్యేక పాలసీ : సబ్ కలెక్టర్

మిర్యాలగూడ టౌన్: క్రీడల ప్రోత్సాహకానికి ప్రభుత్వం ప్రత్యేక పాలసీ రూపొందించిందని సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ అన్నారు. పట్టణంలోని గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న బీసీ గురుకులాల జిల్లా స్థాయి పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలని సూచించారు. ఉన్నత విద్య, ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా ఉంటుందని, క్రీడల్లో రాణించే విద్యార్థులకు ప్రవేశాలు సులభతరమవుతాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన నూతన క్రీడా పాలసీతో ఆటలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయన్నారు. మంగళవారం జరిగిన అండర్-14, అండర్- 19 విభాగాల్లో డిస్క్ త్రో, హైజంప్, లాంగ్‌జంప్ పోటీలు నిర్వహించగా, విద్యార్థులు శ్రావణి, గాయత్రి, స్పందన మొదటిస్థానాల్లో నిలిచారని ప్రిన్సిపాల్ ఉమాదేవి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంఈవోలు బాలునాయక్, బాలు పీడీలు, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంఈవో కృష్ణమూర్తి

విద్యార్థులు ప్రతిభను చాటాలి

హాలియా: విద్యార్థులు పరీక్షలతో పాటు క్రీడా పోటీల్లో తమ ప్రతిభను కనబరచాలని అనుముల ఎంఈవో గుండా కృష్ణమూర్తి అన్నారు. అనుముల మండల పరిధిలోని జడ్పీ హైస్కూల్ యాచారం కాంప్లెక్స్ స్థాయి ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు బాలల దినోత్సవం సందర్భంగా గురువారం ప్రతిభా పరీక్షతో పాటు ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నేటి బాలలే రేపటి పౌరులని, విద్యార్థులను ఉత్తేజపరుస్తూ పోటీల్లో తమ ప్రతిభను వెలికితీయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నాగిరెడ్డి, కాంప్లెక్స్ స్థాయి ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం సిద్ధం


బీసీ ధర్మపోరాట దీక్షకు మద్దతు ప్రకటిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడఅర్బన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలో బీసీ సంఘం ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న బీసీ ధర్మపోరాట దీక్షకు గురువారం ఆయన మద్ద తు ప్రకటించి మాట్లాడారు. జనాభాపరంగా బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయరంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలన్న ఆలోచనలో ప్రభు త్వం ఉందన్నారు. న్యాయబద్ధమైన చిక్కులు తొలగిపోయిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చే స్తామని, ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధి కలిగి ఉన్నారని అన్నారు. అనంతరం దీక్షలో పాల్గొన్న బీసీ సంఘాల నాయకులకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు స్కైలాబ్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిళ్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు, బీసీ జేఏసీ నాయకులు జాజుల లింగయ్యగౌడ్, పోలగాని వెంకటేష్‌గౌడ్ తదితరులు ఎమ్మెల్యేతో కలిసి మద్దతు ప్రకటించారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి


డ్యూయల్ డెస్క్, బెంచీలను బహూకరిస్తున్న పూర్వ విద్యార్థులు

హాలియా, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని లయన్స్ క్లబ్ 320 ఈ డిస్ట్రిక్ గవర్నర్ లయన్ రేపాల మదన్మోహన్ అన్నారు. అనుముల మండలం యాచారం గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో గురువారం అదే పాఠశాలకు చెందిన 2006-07 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు లయన్స్‌క్లబ్ ఆఫ్ నల్లగొండ నోబుల్ వారు మాలే శంకర్‌రెడ్డి, ముక్కపాటి మనోహర్‌రావు, కుందూరు పెద్దిరెడ్డి, దాస వరలక్ష్మి, మురారిశెట్టి నవీన్, మాడుగుల నాగేశ్వర్‌రావు సహాయ సహకారాలతో విద్యార్థుల కోసం రూ. 55వేలతో 11 డ్యూయల్ డెస్క్ బెంచ్‌లను అందించారు. ఈ సందర్భంగా మదన్మోహన్ మాట్లాడుతూ విద్యార్థుల కోసం లయన్స్ క్లబ్ ఆఫ్ నోబుల్ యాచారం ఉన్నత పాఠశాలను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాఠశాల హెచ్ఎం ఎస్.నాగిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జెర్సీ కర్నాటి విష్ణు, నోబెల్ అధ్యక్షుడు తంతెనపల్లి సైదులు, ట్రెజరర్ అయ్యప్పరెడ్డి, సభ్యులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం

కొండమల్లేపల్లి, నవవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని సీతారామాంజనేయ చంద్రమౌళీశ్వర అయ్యప్పస్వామి దేవాలయంలో గురువారం మండల కేంద్రానికి చెందిన వడ్య శ్వేత-నవీన్ దంపతులు సహకారంతో అయ్యప్ప మాలధారులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి చిట్టెడి ప్రభాకర్‌రెడ్డి, భూతరాజు సత్తయ్య, బూడిద శ్రీనివాస్‌యాదవ్, గుమ్మడవెల్లి జనార్దన్, బోడ అశోక్‌యాదవ్, బత్తుల జంగయ్య, బత్తుల విజయ్, బోడ నగేష్, కుంభం రవి, శ్రీను, రమేష్, మాలధారులు పాల్గొన్నారు.

దళారీ వ్యవస్థపై చర్యలు తీసుకోవాలి


చింతపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): దళారీ వ్యవస్థపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు కష్టపడి పండించిన పత్తికి ఇష్టారాజ్యంగా ధరలు నిర్ణయిస్తూ దోచుకుంటున్న దళారులపై చర్యలు తీసుకోవాలన్నారు. సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోలు కోసం వస్తే తేమా పేరుతో కొనుగోలు చేయని పరిస్థితి ఏర్పడిందన్నారు.

శిశువిక్రయాలు చేస్తే కఠిన చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ నాగమణి

అడవిదేవులపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎవరైనా శిశువులను విక్రయిస్తే వారిపై చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని సూపర్‌వైజర్ చిలుకూ రు నాగమణి అన్నారు. మండలంలోని బాలెంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గర్భిణులకు, బాలింతలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. పిల్లలను అమ్మినా, కొన్న వారిపై కేసులను నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా పిల్లలను సాకలేని పరిస్థితి లో ఉంటే తమకు సమాచారం అందిస్తే నల్లగొండలోని శిశుగృహకు అప్పగిస్తామని అన్నారు. గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రంలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. శిశువిక్రయాలు, భ్రూణ హత్యలు చేసే వారి సమాచారం అందిస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అ న్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కుమారి, లలిత, ఆశాలు, తల్లులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు


వాహనాలకు జరిమానా వేస్తున్న పోలీసులు

హాలియా, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తల్లితండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, మైనర్లు రోడ్డుపై వాహనాలు నడిపితే జరిమానాలు తప్పవని ఎస్ఐ సాయిప్రశాంత్ హెచ్చరించారు. గురువారం హాలియా పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహనాలు నడుపుతున్న 10మంది మైనర్లను గుర్తించి వారి తల్లితండ్రులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. అదేవిధంగా వాహనాలకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సాయి ప్రశాంత్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ రోడ్డు భద్రతలో భాగంగా మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా వారిని చైతన్యం చేయాలని కోరారు.

సీసీఐలో పత్తి విక్రయించేందుకు

కౌలు రైతులకు ఓకే

(5వ పేజీ తరువాయి)

కౌలు రైతు పత్తి విక్రయించేలా వివరాలు నమోదు చేశామని, ఈ నేపథ్యంలో భూ యజమాని నిరభ్యంతరంగా ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెబితే ఎలాంటి ఇబ్బందులు ఉండవని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

తాజాగా అవకాశం

కొద్ది రోజులుగా ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేకపోవడంతో అధికార యంత్రాంగం వెబ్‌సైట్‌ను ఓపెన్ చేయకపోవడంతో పాటు ఏఈవోలు యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లను ఉపయోగించడంలేదు. దీంతో కౌలు రైతులు ఇబ్బందులు లేకుండా పత్తి విక్రయించే అవకాశం లేకుండా పోయింది. తాజాగా, ప్రభుత్వ ఆదేశాలతో వ్యవసాయశాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో కౌలు రైతులు సీసీఐలో పత్తి విక్రయించే అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇదిలా ఉంటే జిల్లా వ్యాప్తంగా 55,221 క్వింటాళ్ల పత్తిని సీసీఐ ఇప్పటి వరకు కొనుగోలు చేసింది. జిల్లాలో ఉన్న 23 జిన్నింగ్ మిల్లులకు 18 జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్ల ప్రారంభమయ్యాయి.

చదువు సాగేదెలా?

(5వ పేజీ తరువాయి)

భోజనంలోనూ నాణ్యతా ప్రమాణాలు పాటించడంలేదని పలువురు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. వీటిని సంక్షేమశాఖ అధికారుల సైతం పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం

బీఏఎస్ స్కీంలో ఎంపికైన విద్యార్థుల ఫీజులు ప్రభుత్వం నుంచి రాకపోవడంతో యాజమాన్యాలు పాఠశాలకు రానివ్వకపోతే పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి సమస్యను కలెక్టర్‌కు వివరించాం. ఆమె ఆదేశాల మేరకు విద్యార్థులు పాఠశాలలకు వెళ్తున్నారు. చాలా పాఠశాలల్లో ప్రభుత్వం ఫీజులు ఇవ్వలేదనే కారణంతో తల్లిదండ్రుల నుంచి పుస్తకాలు, షూ, హాస్టల్ తదితర అవసరాల కోసం డబ్బు వసూలు చేశారు. వీటిపై జిల్లా అధికారులు కమిటీ వేసి చెల్లించిన డబ్బును పేద విద్యార్థులకు తిరిగి ఇప్పించాలి.

- గిరిబాబు, పేరెంట్స్ కమిటీ సభ్యుడు

చాలా అన్యాయం

రాష్ట్ర బడ్జెట్‌లో నిరుపేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల చదువులకు అయ్యే నిధులను విడుదల చేయకపోవడం అన్యాయం. ప్రభుత్వం అరకొర నిధులు విడుదల చేయడంతో నిరుపేద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ప్రైవేట్ పాఠశాలలు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేసి బెస్ట్ అవైలబుల్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలి.

- పాలడుగు నాగార్జున, కేవీపీఎస్ నేత